# ఒక్క దణ్ణం

"ఏమే, రామసీతా—"

దొడ్లో గాడి పొయ్యి దగ్గర నుంచుని కనకమ్మ అంది. యీ పిలుపు గదిలోవున్న రామసీతకు వినబళ్ళేదు. "ఊహూం తింగురంగా అంటూ ఏంజేస్తోందో" అనుకుంది. "యిదీ మంచిదే. అది చూడకుండా వుంటేనే మంచిది. నరుడి కంట నల్లరాయైనా పగులుతుందిట. ఎవరి కళ్ళు ఎలాంటివో" అనీ అనుకుంది. కళాయిలో పులుసు తెర్లుతోంది. కరేపాకూ, కొత్తిమీరీ ఎప్పుడేసినా వెయ్యవచ్చు, సువాసనకేగా. ఆకాశానికేసి మెడ ఎత్తింది, చేతులు జోడించి నమస్కరించింది. "నారాయణమూర్తీ, తండ్రీ! నీవు చల్లగా చూసి అబ్బాయికి పేరు వొస్తే—" అంది. యింతలో అలికిడి అయింది. కోడలు వొస్తోందల్లే వుంది అనుకుని చేతులు దించింది. రామసీత వొచ్చి నుంచుంది— శాంతంగా, బంగారు బొమ్మలాగా.

"అప్పుడనగా పిలిస్తే యిప్పుడా అమ్మా రావడం?"

"వినబళ్ళేదు అత్తయ్యా!"

"బాగానే వుంది, కరేపాకూ అదీ తీసుకురా."

"కత్తీ కఠారీనా?" నవ్వింది

పులుసులో కొత్తిమీరీ, కరేపాకు వెయ్యడం అంటే ఆంజనేయులుకు గిట్టదు. వాటికతను కత్తీ, కఠారీ అని పేరు పెట్టాడు. మొగుడి మాటవిని రామసీత కూడా వాటిని కత్తీ, కఠారీ అంటోంది. 'ఊఁ' అంది కనకమ్మ. ఎప్పుడూ యిది అంతే. భగవంతుడికి దణ్ణం పెట్టుకోటానికిగూడా వీల్లేక పోతోంది. ఎల్లాగూ ఆలస్యం చేసే మరీ వొచ్చింది గదా, దేముడికి దండం పెట్టుకున్నాకే రాగూడదూ? కాస్త ఏమన్నా నోరు తెరిచి అందో.... "అత్తగారు ముండమ్మా" అనంటారు. సడేలే అనే వాళ్ళకు నోరూ వాయీ వుందీ? ఇంతకూ దేముడికి దండం పెట్టుకోవడం పూర్తి కానేలేదు. మాయదారి తల్లి వొచ్చి మొదటికి తెచ్చింది.

"నారాయణ మూర్తీ, తండ్రీ! నువ్వు చల్లగా చూసి యివాళన్నా అబ్బాయికి పేరూ అదీ కలిసివొస్తే—సత్తెన్నారాయణవ్రతం చేయిస్తాను." అంది. ఆకాశంకేసి చూసింది. నమస్కరించింది. మృదువుగా చెంపలు వేసుకుంది.

రామసీత కరివేపాకూ, కొత్తిమీరీ తెచ్చింది. పడమటింట్లో వంటైతే అక్కర లేదు. అక్కడే వుంటై. స్నేహితులు పదిమంది వొస్తారని ఆంజనేయులు చెప్పాడు. దొడ్లో గాడి పొయ్యి దగ్గిర వంట చేస్తోంది కనకమ్మ.

అత్తగారు చెంపలు వేసుకోడం రామసీత చూసింది. ఎందుకు చెంపలు వేసుకుంటోందో తెలీలేదు. వోవేళ తను పిలిస్తే వెంటనే రాక, కొత్తిమీరీ, కరేపాకూ అవీ తెమ్మని చెబితేగాని తేలేదని కోపమేమో ననుకుంది .

"ఏం అత్తయ్యా, అల్లా వున్నారు" అంది.

కనకమ్మ మాట్లాడలేదు.

సరే కోపమే అయి వుంటుందనుకుంది రామసీత. ఏం జేస్తుంది తను. ఆవిడ పిలిచింది కాబోలు, వినపడలేదు. వినపడితే రాదూ? వొచ్చింది, చెప్పిన పని చేసింది. ఇంతలోనే కోపం ఐతే ఎల్లాగమ్మా వేగడం? అయినా తనెందుకు? చూస్తూ వూరుకుంటే సరి.

యివాళే నాటకం. ఆంజనేయులి ముఠావాళ్ళు ఆడుతున్నారు. రామసీతకు యీ నాటకాలంటే గిట్టదు. తరతరాలా శిష్టాచార సంపన్నులయిన వారి యింట్లో పుట్టింది ఆమె. అమెకు తన మొగుడు నాటకంలో వేషం వేస్తాడంటే ఏమిటోగా వుంది. శుభ్రంగా తిని కూచోక లేనిపోని యీ వేషాలు ఎందుకు? అయినా అయినయింటివాళ్ళు నాటకాల్లో వేషాలు వేస్తారూ? "ఆయన లేడూ, నాటకాలలో వేషాలు వేస్తాడే, ఆయన పెళ్ళాం" అంటే ఎంత అపర్దిష్ట? అయినా తనకెందుకు? నోరుమూసుకు వూరుకుంటే సరి అనుకుంది.

ఆయన్ను సగం యీవిడే చెడగొట్టేది. "నీ నాటకాలేమిటో నీ గోలేమిటో—బైట యేమన్నా చెయ్ — యింటిమీదికి మాత్రం తీసుకు రాకు" అని యీవిడేమన్నా అంటోందా? ఉహూ. అబ్బాయి స్నేహితులంతా దేముళ్ళే. వాళ్ళొచ్చేదీ, కొంపమీదపడి నానాగత్తరాచేసి పోయేదీనూ. పెద్దదిగదా తను, 'యిదేమిటి——' అన్నదా ఏమన్నా? నవ్వుతూ చూస్తూ వూరుకుంది. వొచ్చిన వాళ్ళలో వో కుంక....

"అంజీ! మీ ఆవిడ చీరలూ, నగలూ తేరాదూ" అనంటాడూ? తన చీరలూ, నగలూ మాట వాడనవచ్చా? ఊఁ తనకెందుకు? చూస్తూ ఊరుకుంటేసరి.

'అత్తా! అత్తా!'

పక్కయింటి వాళ్ళ పిల్లవాడు, తన కోసమే.

"దా!"

రామసీత ఆ పిల్లాడికి ఎదురు వెళ్ళింది. సరాసరి మాలిమిగా వొచ్చాడు ఆ అబ్బాయి.

వొస్తూనే —–"అత్తా! నే నోటడుగుతా చెప్పవూ?" అన్నాడు. రామసీత తల వూపింది.

"తలూపితేగాదు, లేదు అనగూడదు."

—తలవూపింది మళ్ళీ ఆమె.

"కాదు అనగూడదు."

—నవ్వింది.

"నవ్వుతావేమమ్మా. ఊఁ——"

అసలేమిటో తెలియకపోయె. ఊరికే, ఏమిటో చెప్పకుండా వుంటే——మరింత నవ్వొస్తోంది ఆమెకు.

"నిజంగానేనమ్మా!"

"చెప్పు మరి."

"ఇవాళ మన వూళ్ళో ఏమిటో చెప్పుకో."

రామసీతకు అర్థం కాలేదు. 'తెలీ' దంది.

"శ్. ఇంతేనా? నే చెప్పనా?"

"ఊఁ."

"నాటకం."

మనస్సుకు కాస్త హుషారు కావాలన్నప్పుడు పిల్లల దగ్గిరుంటే చాలు, నవ్విస్తారు. కానీ వాళ్ళే ఓ అప్పుడు తమకు తెలీకుండానే సూటిగా గుచ్చినట్టు మాట్లాడి గిలగిల లాడిస్తారు.

'సడేలే-' అంది

తనలాగానే అందరూఅనుకోడం మానవస్వభావం. ఇది అమాయ యకత్వపు చిహ్నం. అమాయకత్వం యింకా ఎంత ప్రక్షాళన కాదో అంత సూటిదనం వుంటుంది. పసిపిల్లల్లో యిది మరీనూ. పసివాడు నాటకం పేరెత్తకపోతే హాయిగా వుండేది. పసివాడికి లాలన జరిగేది. తనే నాటకం ప్రస్తావన తెచ్చి వుండేదేమో గూడాను. హృదయశాంతి కోసం పిల్లాడే ముందు నాటకం మాట తెచ్చేసరికి రామసీతకు మన సౌకలాగయింది. తన యిది వాడిదగ్గర వెళ్ళబుచ్చటం దేనికి, దీనిమీద చిలికి చిలికి గాలివాన కావడం దేనికీ అనుకుంది ఆమె. ఏమయినా తను యీనాలు గ్గడియలూ చూస్తూ వూరుకుండ దలచుకుంది.

"ఊఁ"

"అదేమిటత్తా, ప్రద్దానికీ ఊఁ, ఊఁ అంటావ్? నవ్వుతూ మాట్లాడ వేం?"

రామ సీత నవ్వింది.

"అమ్మయ్య! నాటకానికి తీసికెళ్తావన్నమాటే—"

పసివాడి ధోరణి బోధ పడింది. వాడు నాటకం చూట్టానికి యిదవు తున్నాడు. తనేం చెప్తుందీ? చూస్తూ వూరుకుంది.

"ఏమత్తా, తీసుకెళ్ళవుటమ్మా అత్తా!"

"అల్లాగే!"

"నిజంగానా?"

పసివాడు రాముడు నమ్మలేకపోయాడు. కష్టసాధ్యం ఐన వరం తేలిగ్గా వొస్తే ఎవరైనా సరే తొందరగా నమ్మలేరు.

రామసీత తలూపింది.

రామసీతకు తన బాల్యం గుర్తుకొచ్చింది. సముద్ర స్నానాలకూ, వాటికీ తనూ యింతే చేసేది. తన పరికిణీ, చొక్కా అవీ ముందే సర్ది

వుంచుకునేది. వెళ్ళాలన్న వుత్సాహం కొద్దీ వొచ్చిన చుట్టాలను యిలాగే అడిగేది. ఐపోయినై ఆ రోజులు.

ఇంతలో గబగబా ఆంజనేయులు యింటికి వొచ్చాడు. కొండలు పిండికొట్టి వస్తున్నట్టు వొచ్చాడు. సావిట్లో అతనికి రామసీత కనిపించింది. పక్కని రాముడూ వున్నాడు.

"మా అమ్మేదీ-?" అన్నాడు ఆంజనేయులు.

"దొడ్లో వున్నారు" అంది ఆమె.

ఆంజనేయులు సరాసరి దొడ్లోకి వెళ్ళాడు. కనకమ్మ వంటంతా పూర్తి చేసుకుంది. స్నానం చెయ్యబోతున్నది.

"అమ్మా, వంటైందా?"

"ఆహా."

"వంట మాటకేంగానీ, చిక్కొకటి వొచ్చి పడ్డదే."

కనకమ్మ తలెత్తింది.

"చీరలు రెండు కావాలమ్మా. కాసిని నగలూ కావాలి."

"దాన్నడుగు. నన్నడుగుతావేం?"

"సడేలే, అది యివాళ చెప్తే వినేట్టుందీ——"

రామసీతకు యీ మాటలు వినబడ్డాయి. సరాసరి వొచ్చింది.

"అల్లాగే——ఏం కావాలో తీసుకోండి."

ఆంజనేయులు తెల్లబోయాడు. ఇవ్వనంటుందనీ, రగడజరుగుతుందనీ ఆలోచిస్తూ వొచ్చాడతను. ఏ మాట మీద ఏ మాట విసరాలో, అసలు రగడ ఎలా జరుగుతుందో అదంతా అతను తనలో తాను ఊహించాడు. ఒక రిహార్సల్ గూడా చేసుకువొచ్చాడు. అదంతా మబ్బులు తేలిపోయినట్టు తేలిపోయింది.

"పద" అన్నాడు.

రామ సీత తన కావిడి పెట్టె తీసింది. పక్కకు తప్పుకుంది. కొర్నాటి చీరా, ఉప్పాడ చీరా, మరో పట్టుచీరా తీసుకున్నాడు. పెట్టె అంతా కెలికాడు. పెట్టె మూతపెట్టి వొచ్చాడు.

"మెళ్ళోవిగూడా యిస్తావా?" అన్నాడు.

"దాందేముందీ, తీసుకోండి."

పేచీ వొస్తుందనుకున్న చోట పేచీ రాకపోటం ఎంతో నిరాశను కలిగిస్తుంది. ఎంతో ప్రేమైనా వుండాలి; కావలసినంత అసహ్యం అన్నా వుండాలి పేచీ రాకపోవటానికి. అసహ్యంతో భార్య యిస్తే తను తీసుకుంటాడా?

"మరైతే నువ్వు గూడా పెందరాళే తెములు" అన్నాడు భార్యతో అతను.

రామసీత మాట్లాడలేదు

"నిన్నే—"

ఆమె తలెత్తింది.

"నాటకానికి నువ్వురావా?"

"అత్తయ్యగూడా వొస్తున్నారా?"

"ఏమో—"

"నేనూ, అత్తయ్యా యింటో వుంటాంలెండి"

"నువ్వు రావాలి"

తను చేసే పనిని భార్య చూడాలి, సంతోషించాలి, తన్ను మెచ్చుకోవాలి. తనకు ఆమె ప్రోత్సాహం యివ్వాలని కోరుకోని మనిషి వుంటాడా? ఆంజనేయులూ ఆ వుద్దేశంతోనే అన్నాడు.

రామసీత మాట్లాడలేదు.

"నిన్నే—"

ఈసారి అతని గొంతుకలో ప్రేమ ప్రమోగింది. భర్తగనుక దబాయించినట్టు అన్నాడు గానీ

"నేను రాను."

"ఏం?"

"ర్రాను!"

"ఊఁ"

"ఏం మాటలండీ యివి! మొగుడు వేషాలు వేస్తూంటే పెళ్ళాం వొచ్చి చూస్తుందీ? చూడొచ్చా?"

"నిక్షేపంగా చూడొచ్చు"

"దానికేం గానీండి. అందరూ పోతే—యిల్లు—"

"మా అమ్మ వుంటుందిగా? యీ మాటలకేంగానీ— నాన్నక పెందరాళే తెములు"

"ఆవిణ్ణి ఒక్కర్తైనూ వుండమని పోవడం బాగుండదుగానీ, నా మాట వినండి"

"పోరాదుటే—వాడు అంత యిదిగా రమ్మంటుంటే—" అని అందుకుంది కనకమ్మ.

"నేను వెళ్ళనండీ అత్తయ్యా"

రామసీత గొంతుక మారుతోంది. ఏడుపుకి దగ్గర్లోకి వడుతోంది.

"బాగానే వుంది" అన్నాడు అతను.

"ఇంతేనమ్మా ఆణముండలు ఎప్పుడూ యింతే. అన్నయ్యను వొదిన కాల్చుకుతినలా? ఎక్కడికి పోతై బుద్ధులూ" అంది కనకమ్మ. ఈ సంబంధం మేనరికం.

"మా అమ్మేం గుడిశేటిదీ పడిశేటిదీకాదు—ఆ బుద్ధులు వొచ్చి నేను చెడిపోటానికి. ఆవిడేం వేలుపెట్టి వొంపించుకోలేదు. పరువుగానేవుంది. ఇంతకూ ఆవిడేం నీకు పరాయిదికాదు. సాక్షాత్తూ అన్న పెళ్ళాం" అంది రామసీత.

"ఆ. అన్నపెళ్ళామే—మేనరికానికి వోపట్టాన వొప్పుకుందా మా తల్లి? అయినా యిప్పుడవన్నీ ఎందుకు—?"

"అన్నీ అనేదిన్నీ, ఎవరో అంటున్నట్టుండేదిన్నీ. ఇప్పుడవేం నే తీసుకురాలేదు——"

రామసీత యీ మాటలు యించుమించుగా ఏడుస్తూనే అంది.

"నాకెందుకు. దాని యిష్టం, దాని మొగుడిష్టం" అని కనకమ్మ చక్కాపోయింది.

రామసీత అక్కడే నుంచునుంది. దానిష్టం, దాని మొగుడిష్టం, నాకెందుకు అనుకున్నది. తను రాకపోతేనేం? వొచ్చిన సప్తపితాళ్ళకూ పెట్టకపోతేనేం. కడుపు భగ్గున మండింది. ఆడది మండి మాత్రం ఏంచేస్తుంది? తన వాళ్ళెవరూ లేనిచోట తాను నిలబడి వుండాలి, బతకాలి. తన వాళ్ళెవరూ లేకేం? అవటానికి మేనత్తా, మేనత్తకొడుకూనూ. అంతా తనవాళ్లే. కోడలయింది గనుకా, పెళ్లామయింది గనకానూ యీ మాటలన్నీనూ. మేనత్తగదా అని ఏమన్నా వెనకేసుకొచ్చిందా? పెట్టవలసిన మంగళహారతులన్నీ పెట్టి విడిచిందికాని.

ఆంజనేయులుకు ఏమీ తోచలేదు; సరే అన్నాడు. బరువుగా బైటికి వెళ్ళాడు. తీసిన చీరలూ, అవీ మంచమ్మీదే వున్నాయి.

ఆంజనేయులూ, స్నేహితులూ వొచ్చారు. నాటకాల మాటలే చెప్పుకుంటూ భోంచేశారు. భోజనాలు కాంగానే ఆంజనేయులు గదిలోకి

వెళ్ళాడు. మంచంమీద రామసీత పడుకుని వుంది. లోపల్లోపల ఏడుస్తోంది.

"నిన్నే"

తలెత్తలేదు ఆమె. బయట విధిగా చూపించే వినయం గదిలో చూపబడదు.

"నామాట వినవూ"

"నే విన్నండీ!"

"నిజం?"

".... .... ...."

"రావూ నాటకానికి?"

".... .... ...."

"నీ ఖర్మ—"

ఆంజనేయులు వెళ్ళిపోబోతున్నట్లు నటించాడు.

"ఖర్మేమరి—"

ఆంజనేయులు యిక ఆగలేకపోయాడు. బైట స్నేహితులు కాచుకున్నారు. వాళ్ళేమనుకుంటారు?

"లే, అన్నం తిను, లే."

రామసీత అట్లాగే పడుకుంది. ఆంజనేయులు నుంచునేవున్నాడు. గదిలో నుంచోటం చిరాకుగా వుంది. భార్యపడుకుని మాట్లాడుతుంటే తాను నుంచొని మాట్లాడ్డం పురుషుడికో సరదా. ఎప్పుడు? తను కోరుకున్నప్పుడు. విశాల మానవత్వం చిఃకల్లేవొచ్చి వాలుతుందే, అప్పుడు. కోపం వచ్చినప్పుడో—ఎందుకూ ఆ మాట?

రామసీత కాలి పట్టాగొలుసు మెరుస్తోంది. చీలమండలకు పైగా కాలు పట్టుకుని ఎత్తి వొదిలేశాడు. ఠక్కుమంది. మంచం కోటకు కొట్టుకుంది, రామసీత ఏడుపు దిగమింగలేక పోతోంది.

"లే-అన్నంతినూ"

రామసీత మాట్లాడలేదు.

"అంజనేలూ!"

—వాకిట్లో స్నేహితులు. ఆంజనేయులు చీరలూ, అవీ తీసుకున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ మొహంచాటు చేసుకున్న భార్యకేసి చూడకుండానే వెళ్లిపోయాడు.

రామసీత ఆ రాత్రి అన్నం తినలేదు. అలిగి పస్తుపడుకుంది. "ఇంతమంది తినగాలేంది నీవు రావేమే" అని అత్తగారు అనిపోయింది. "స్థానబలిమికాని తనబల్మి కాదయా" అని చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తుకొచ్చింది తెల్లారె రామసీతకు.

ఆ రాత్రి నాటకం అభాసు అయింది. గొడ్లపాకను హాలుచేశారు. ఆడారు. ఆంజనేయులు బలవంతంమీద ఆడిస్తున్నాడు యీ నాటకాలు. అతనికి నాటకాలు ఆడించడం సరదా. రంగేసుకుని తనుండటం, మాట్లాట్టం,పోజులు పెట్టటం.యివన్నీ అతన్ని ఉత్సాహపరుస్తవి.ఎప్పటికయినా స్థానం నరసింహారావంత కావాలని అతని వుద్దేశం. ఆ పల్లెటూళ్ళోనే నలుగుర్నీ పోగుచేసి, నలుగుర్నీ రప్పించి నాటకాలు ఆడుతున్నాడు. మొదట్లోనే హంసపాదు. మొదటి నాటకమే మట్టికొట్టుకు పోయింది.

ఆ పాత నాటకాలే కావడం, వాటినైనా చక్కగా ఆడలేకపోటం, రోజూ ప్రత్యక్షమయ్యే వాళ్ళేకావటం, అన్నింటికన్నా వీటిమీద అసహ్యం పెరగటం—ఇలాంటి కారణాలవల్ల అవి ఎక్కి రావడంలేదు. అతను చిన్నప్పుడు బస్తీలో చదువుకున్నాడు. ఇతని చదువుల కోసరం

కాపురం బస్తీకెక్కింది. కొడుకు చదివి ప్రయోజకుడౌతాడన్న వుబలాటం ఏతల్లి కుండదు? కనకమ్మకూ వుంది. "వాడికేమే మహరాజు. తను సుబ్బరంగా యింత తింటాడు? నలుగురికీ పెడ్తాడు. చాపచెడ్డా చదవకు లోటుండదు" అన్న ధీమా వుండేది ఆవిడకు. ఇది కాస్తా దాచుకునేదికూడా కాదు, నలుగురిలోనూ అనేసేది. నలుగురూ విని ఏమనుకుంటారో అని ఆమె అనుకునేదికాదు. ఛోంచేసి, టక్కున వక్కపలుకు కొరుకుతూ, కిరీటం సవరించుకుంటూ ఆవిడ ఈ మాట అంటూంటే....ఆమెకు మహేంద్ర పదవి వొరిగినట్టుండేది.

ఆంజనేయులుకూ ఉండేది యిది. పైగా తల్లి గూడా అంటోంది. వొళ్లు వంచి చదవకపోతేనేం—తను షైన్ కాగలడు. అయినా, వెధవ చదువు. ఎప్పుడూ పుస్తకాలు రుబ్బటం మాత్రం—ఛీ, అతనికి చాత కాదు. ఒరిజినల్‌గా థింక్ చెయ్యాలి. అంతేగాని, రుబ్బి పరీక్షలు ప్యాసు కావడం అంటే అతనికి నామర్దా. గేమ్సు ఫీ కట్టినందుకుగాను, అతను దాన్ని సార్ధకపరచేవాడు. రోజూ ఫుట్‌బాల్ ఆడో, మరేమన్నా చేసో, దెబ్బ తగిలించుకు రావడమూ, ఐదోఫారం పట్టించుకోడమూ పరిపాటి అయింది. మూడునాలుగేళ్ళు చదువు గుంటపూలు పూసింది. "చాపచెడ్డా చదరు" అన్న ధీమా పెరిగింది. చివరికి పేకాటలో మునిగి తేలి, ధూమ యజ్ఞంలో నిష్ణాతుడై, రోగాలు తగలడం తరువాయిగా మళ్ళీ స్వగ్రామం చేరాడు. సైకిలు విప్పగలడు, మళ్ళీ అతకగలడు. పేకాటలో మంచి షామేదా. సప్తప్రహరి చేసినట్లు ధూమయజ్ఞం చెయ్యగలడు.

స్వగ్రామం వొచ్చాకే ఆంజనేయులు జొపోసన కార్యం జరిగింది. రామసీత కాపరానికొచ్చింది. మొదట్లో మేనమామ ఏమంటాడో అని అతను అనుకునేవాడు. కాని, పిల్లనిచ్చుకున్న తరువాత మేనమామ మామగారైనాడు. భూమ్మీద అల్లుళ్ళు మామగార్లను గౌరవించటం అపు

రూపం గనుక, అతనూ మామగారిని సమానస్థాయాలో జమకట్టి భయ భక్తుల్ని విడిచేసేవాడు. ఖుషీగా తిని తిరుగుతుండేవాడు. పొద్దుపోటానికి కుదేలుబేస్తులూ, సాయంత్రం వేళ కొంచెం బాట్‌మింటనులతో సరి పోయేది.

ఈ పరిస్థితుల్లో రామసీత కాపరానికొచ్చింది. తన అన్న తన మొగుణ్ణి తేలిగ్గా మాట్లాడుతూంటే రామసీతకు కొత్తలో గమ్మత్తుగా వుండేది. తరవాత్తరువాత అన్నీ అబద్ధాలాడుతున్నాడనుకునేది. చివరికి యింత ఘోరకలి వుండదనుకునేది. సహజంగా మొగుడి పక్షమే అయింది. తను మొగుడి పక్షం మాట్లాడ్డం బావుండదు గనుకా, సిగ్గు సహజంగా అలుముకుని వుండేది గనుకా, ఆమె పెదిమవిప్పి మాట్లాడేది కాదు కాని మనస్సు మాత్రం మొగుడి పక్షమే వుండేది.

తీరా కాపరానికి వొచ్చాక చూస్తే యిది. పేకాట ఆడటంలో తన మొగుడు మునిగి తేలివుంటే ఆమెకు కష్టం వేసింది. ఇంట్లో పది మంది తుమ్మాయి జగ్గాయిగాళ్ళను చేర్చి వాళ్ళతో అంతూ పొంతూ లేకుండా పడివుంటే ఆమె మనస్సు ఒకలాగ అయింది. సొంత మేనత్త అయి గూడా, అత్తగారు అల్లా వుంటే యింకా కొట్టినట్టు అయింది. చివరికి నాటకాల్లో వేషం వేస్తానని మొగుడు అన్న రోజున తల తీసేసినట్టు అయింది. అన్నగారు అన్నమాటల్లో ఒక్కటీ అబద్ధం లేదు. తెలీక తను అన్నను నానా మాటలూ అంది.

నాటకం పూర్తయిన మర్నాడు ఆంజనేయులు తనలో తానులేడు. ఓడిపోయిన బక్క కోపం అతనికి వొచ్చింది. అంతు చూద్దామని నిశ్చ యించుకున్నాడు. ఏమయినా సరే— యింటిలోనే తను షైన్ కావాలి. యిదేం తక్కువదా? తెలీక తన భార్య వొద్దంటుందికాని. వెధవ మంకు పట్టు పట్టుక్కూచుని నాటకానికి రాలేదు గాని. వొచ్చి వుంటే అన్నీ తనతో కలిసేదే.

ఓ నిద్రతీసి లేచాక, రామసీత దగ్గిరికి వొచ్చింది. నల్లని చీర కట్టుకుంది. తెల్లని మల్లు రెవిక తొడుక్కుంది. పచ్చని మనిషేమో—— ఎంతో అందంగా వుంది. రాత్రి తిండి మాడ్చుకుని ఏడ్చేడ్చి వుందేమో నిద్ర లేకుండా వుందేమో— మొహం బరువుగా వుంది. వొచ్చి మొగుడి మంచం దగ్గిర కింద కూచుంది. ఆంజనేయులు కళ్ళతో తనివితీరా చూస్తున్నాడు భార్యను. కాస్త నలిగిన పువ్వులాగుంది ఆమె.

"తింటానికి ఏమన్నా తేనా?"

రామసీత ఎంతో ముద్దుగా అడిగింది. ఆంజనేయులు ఈ ముద్దును అర్థం చేసుకున్నాడు. సంతోషంతో అతని కళ్ళు సగం మూతలు పడ్డై.

"ఏమున్నై?" అన్నాడు.

"అటుకులు పాలల్లో వేశా"

ఆంజనేయులు కళ్ళు ఎగరేశాడు. 'తే' అన్నాడు. హంస నడిచి నట్టు నెమ్మదిగా నడిచి వెళ్ళింది రామసీత. తీసుకొచ్చింది. మంచానికి ఆనుకుని కింద కూచుంది.

"దా" అన్నాడు ఆంజనేయులు.

రామసీత నవ్వింది. నెమ్మదిగా అటుకుల్ని కాస్తకాస్త తీసి అతని నోట్లో పెట్టింది. ఆంజనేయులు అటుకుల గిన్నె తను తీసుకున్నాడు. నిశ్శబ్దంగా, నెమ్మదిగా తిన్నాడు. ముద్దుకైనా కాస్త తనకు పెడ్తాడనుకుంది రామసీత? ఒక్కసారి చురుగ్గా చూసింది. ఆంజనేయు లిదేమీ గమనించలేదు. నెమ్మదిగా సిగరెట్టు తీసి అంటిం చాడు.

"ఇవి మానగూడదుటండీ!"

ఆంజనేయులు నవ్వాడు. పిచ్చి బొంచా, నీ మాట నేను వింటా నుటే అన్నట్టు అర్థమయింది ఆమెకు. నెమ్మదిగా ఖాళీ గిన్నె తీసుకుని లోపలికి వెళ్ళింది.

# 2

"నేను వినయ పూర్వకంగా రొట్టెకోసం వేడుకున్నా. నాకో రాయి లభించింది. ఆంగ్లజాతి బల ప్రయోగానికి మాత్రమే లొంగుతుంది. భారతజాతికి తెలిసినది ప్రజాశాంతి ఒక్కటే. అది పెద్దఖైదు. భారతదేశం ఒక పెద్ద కారాగృహం. నేనీ బ్రిటీషు శాసనాన్ని ధిక్కరిస్తాను. వైస్రాయి కోరే శాంతి విసుగుపుట్టించే శాంతి. ఆ నిర్బంధ శాంతి మూలంగా భారత జాతి కూపిరాడుటలేదు." అని గాంధీజీ వ్రాశారు.

దండీ యాత్ర తప్పనిసరయింది. తనవెంట వచ్చే పాదచారులతో దండీయాత్ర సాగింది,

దండీ ప్రస్థానానికి ప్రజాసముద్రం తరంగితమైంది. కథలు కథలుగా, గాథలుగా, బోధలుగా ఉప్పు సత్యాగ్రహం ప్రజల్ని ఉవ్వెత్తుకెత్తింది. మట్టిలోంచి మనుషులు లేచారు.

ఆసేతు శీతాచలం గాంధీగారికేసి చూసింది.

ఊరూరా సభలు జరిగినై. స్త్రీలు, పురుషులు, పసిబిడ్డ బాలాదీ కదిలారు. తఖిలీలు వడుకుతూనే సభలకు వచ్చేవారు. లాఠీ దెబ్బలుతిన్నారు. "స్వరాజ్యం కావాలా? ఐతే యిదుగో లాఠీ! అని పోలీసులు ప్రజల్ని పలకరించేవారు. స్త్రీలు, పురుషులు ఉద్యమంలో కెళ్ళారు, ఉప్పుతెచ్చారు, తాళ్ళు కొట్టారు, పికెటింగ్ చేశారు. అరెస్టయ్యారు, జైళ్ళకెళ్ళారు. భారతభూమిలో దాదాపు డెబ్భయ్యాయిదువేలమంది శ్రీ కృష్ణ జన్మస్థానాన్ని అలంకరించారు, తిరిగి వొచ్చారు- ఉప్పు సత్యాగ్రహంతో దేశజీవనంలోనే మార్పువొచ్చింది.

గాంధీజీ హరిజనులకోసం ఉద్యమించాడు. అదేరోజుల్లో రామ సీతకు గర్భం వచ్చింది. కడుపుతో వుంటే కాకైనా అందంగా వుంటుం దంటారు. రామసీత అసలే అందగత్తె ఏమో మరింత అందంగా వుంది. ఉన్న కోసిని నగలూ తగ్గించింది. ముక్కులూ, చెవులూ, మెడా మరీ బోసిపోకుండా అత్యవసరమైన వొస్తువులు మాత్రం వుంచుకుంది.

ఆంజనేయులులోనూ మార్పు వచ్చింది. అతను రాటమొకటి ఇంటికి తెచ్చాడు. రోజూ తెలుగు పేపరు తెప్పిస్తున్నాడు. క్రాఫింగు తీయించాడు. పేటకుపోయి ఖద్దరుబట్టలూ, చీరెలూ, గుడ్డలూ తెచ్చాడు. పొద్దున్నే చద్దెన్నంతిని రాటంముందు కూచుంటాడు. మధ్యాన్నం నిద్ర పోయి లేచి మళ్ళీ దానిముందే కూచుంటాడు.

"ఈ బండ చీరలు నేను కట్టుకోలే" నంది రామసీత. వీల్లేదన్నాడు ఆంజనేయులు. "కడుపుతో వున్నపిల్ల ఎల్లా కడ్తుందనుకున్నావురా అవీ" అని కనకమ్మ అంది. అతను అక్కడితో ఆ ప్రయత్నం వొదులు కున్నాడు. రామసీత ఖద్దరు చీరల్ని దుప్పట్లుగా చేసింది.

ఇంట్లో శాంతి వాతావరణం వొస్తోంది. అప్పుడప్పుడు పేపర్లో జరిగిన విషయాలు ఆమెకు చెప్తూండేవాడు. రామసీత అంతా విని వూరు కునేది. నమ్మేదికాదు. కానీ మొగుడి గొంతుకలో నిబ్బరం, నిశ్చలత్వం చూసి నిజమే కాబోలు అనుకునేది.

ఆంజనేయులు రాటం వొడుకుతాడు. మాలామాదిగల్ని చూసి దూరంగా తప్పుకోడు. వాళ్ళను వూత తిట్లు తిట్టడు. మనిషి మారు తున్నాడు. చాటుగా వోనాడు "వాళ్ళను అల్లా పూసుకు తిరగొచ్చా" అనడి గింది మొగుణ్ణి రామసీత.

"ఏం, వాళ్ళు మాత్రం మనుషులు కారూ?"

"మనుషులు కాదన్నానా, వాళ్ళను ముట్టుకోగూడదుగా"

"అవన్నీ అబద్ధాలు. గాంధీగారు ఏం చెప్పారు?"

"ఆ పటంలో వున్న ఆయనేనా" అంది. దరిద్ర నారాయణుని పటం దగ్గిరకి వెళ్ళింది. నిదానంగా చూసింది. అత్తగారి దగ్గరకి వెళ్ళింది.

"ఏమత్తయ్యా" అన్నది.

"నాకేం తెలుస్తుందే" అన్నది. ఆమెకూ కొడుకు ఖిల్లా కావడం యిష్టంలేదు. కాని, ఎవరేమన్నా వినేస్థితిలో లేదు. పైగా ఆమెది కొడుకు ఏంచేస్తే అదే పదివేలు అనే మతం.

రామసీత నిదానంగా ఆలోచించింది. అప్పటినుంచీ పాలేరు కుర్రాళ్ళను, చాకలివాన్ని, ఎవర్నీ కోప్పట్టం, కసరటం మానుకుంది. రామసీత ముభావంగా వుండటం ఎక్కువయింది. బహు కొద్దిగా మాట్లాడుతుంది.

ఆంజనేయులు హరిజనుల్ని గుళ్ళల్లోకి రానివ్వాలని నలుగురితో అనడం ప్రారంభించాడు. నలుగురూ తలోమాటా అన్నారు. నలుగురైదుగురు "చేశావులే నిర్వాకం, కాస్త కట్టి పెట్టు" అని సలహా యిచ్చి చక్కాపోయారు.

యాదవ ముసలం పుట్టున్నదన్నాడు శాస్తుర్లుగారు. ఆంజనేయులు విడిచి పెట్టలేదు. భగవద్గీత తెచ్చాడు. చూపించాడు. శాస్తుర్లుగారేమన్నారంటే -"ఇదంతా నిజమే కాని ఈ యుగంలో మాట కాదిది." అన్నారు-బహు నెమ్మదిగానే అన్నారు. "ఐతే ఎందుకిది" అని నేల్కేసి కొట్టాడు పుస్తకాన్ని ఆంజనేయులు. దాంతో శాస్తుర్లుగారు చక్కాపోయారు.

"పెద్దవాడితో నీ కెందుకురా" అంటూ కనకమ్మ వచ్చింది.

"పెద్దతనం దక్కించుకొంటేనే పెద్దతనం వొస్తుంది." అన్నాడు ఆంజనేయులు.

"బిడ్డా, పాపా కలవాళ్ళం భగవద్గీతను నేల్నెట్టి కొట్టొచ్చు(టా" అన్నది ముసిలావిడ.

రామసీత కడుపుతోవున్నప్పటి నుంచీ యింట్లో తొట్టె మంచం వేసి నట్టుగానే అనుకుంటోంది ఆవిడ. యీ మాట అన్నప్పుడు రామసీతకి మామూలుగా వొచ్చే సంతోషపు నవ్వురాలేదు. ఏమవుతుందో అనుకుంది. ఆంజనేయులు శాంతించి మళ్ళీ రాటం దగ్గిరకి వెళ్ళాడు. పది పోగులన్నా తియ్యలేకపోయాడు. ఆసు తీసుకొచ్చాడు. ఎనభై పోగులూ పోసి ముడి వేస్తూ కూచున్నాడు. కనకమ్మ పక్కయింటికి పెత్తనానికి వెళ్ళింది. రామ సీత వొచ్చి పక్కనే కూచుంది. ఆంజనేయులు తలెత్తి చూశాడు.

"వాళ్ళను గుళ్ళలోకి రానివ్వాలా" అంది.

"వాళ్ళకు మాత్రం దేముడు కాదూ."

"రానిస్తే విగ్రహం మైల పడిపోదూ."

"మనిషి వొస్తే విగ్రహం మైల పడుతుందిటే పిచ్చిదానా. యివన్నీ మనం పెట్టుకున్న అడ్డంకులు. మనుషులందరూ ఒకటే. అంద రికీ అన్ని వేళ్ళూ వుండాలి." అన్నాడు.

రామసీత నెమ్మదిగా కూచుంది. ఆలోచిస్తూ కూచుంది. నిజమే కష్టం, సుఖం అందరికీ ఒకటే.

"ఐయితే అందరూ గుళ్ళోకి పోవచ్చా"

"ఆ"

చిలప పూర్తి అయింది,నెమ్మదిగా ఆసునుంచి చిలప తీశాడు. బరు వుగా నిట్టూర్పు విడిచాడు "నేనోటి చెప్తా వినవే—మనం పోవొచ్చు గదా గుళ్ళల్లోకి? రోజూ పోతున్నామూటే? మనం పోం. పోతానన్న వాణ్ణి పోనీం" అన్నాడతను.

"పోకేం. పోతున్నాంగా ముక్కోటికి"

"ముక్కోటీ, శివరాత్రీనూ! మిగతారోజులలో....?" నవ్వాడతను. లేచాడు.

రామసీత లేచింది. బుడ్లల్లో చమురు పొయ్యాలి, సందెకసువు వూడ్చాలి ఇప్పటినుంచీ ఆవిడే అన్ని పనులూ చేస్తే బాగుండదు. ఆమె నెమ్మదిగా కిరసనాయిల్ డబ్బా దగ్గిర కూచుని బుడ్లల్లో చమురుపోస్తూ ఆలోచించుకుంటోంది. "మనం వెళ్ళచ్చుగదా గుళ్ళల్లోకి? రోజూ వెళు తున్నామటే—" అన్నమాట రామసీత చెవుల్లో మోగుతోంది. మనం ఎందుకు వెళ్ళం అనుకుంది. బద్ధకం. ఒకరికైతే బద్ధకం, యిద్దరికైతే బద్ధకంగాని, అందరికీ బద్ధకమేనా? బుడ్లల్లో చమురు పోయడం అయింది నెమ్మదిగా సందెకసువూడ్చింది. ముగ్గుకర్ర ఆడించింది. పొద్దుటిముగ్గులు అన్నీ చెరగవు. యింట్లో పిల్లలు వుంటే చెరుగుతై. పాపాయి వొస్తే ముగ్గులు చెరుగుతై అనుకుంది. పాపాయి అనగానే వొళ్ళు ఝల్లుమంది. నవ్వుకుంది.

ఇకనుంచీ శుక్రవారం శుక్రవారం అమ్మవారి గుళ్ళోకి వెళ్ళాలి. అమ్మవారికి పసుపూ, కుంకం యిచ్చిరావాలి అనుకుంది. వెళితే యిది వరకునించే వెళ్లాలిసింది. పాపాయి పుట్టేశాక యింకేం వీలవుతుంది? పొద్దస్తమానం వాడి పనితోటే సరిపోతుంది.

కనకమ్మ వొచ్చింది. సందెకసవు వూడ్చి ముగ్గులు వేసివుంది. తను వేస్తుందిగా. నెలలు వొస్తున్నాయిగదా, ఏం అంత తను వెయ్యాక పోతే, "అంత తొందరేమొచ్చిందమ్మా, రానా, వెయ్యనా?" అంది. రామ సీత తలెత్తి చూసింది.

"శుక్రవారం శుక్రవారం గుళ్ళోకెళదామా అత్తయ్యా" అంది.

"వెళ్ళినట్టేవుంది. అంత మాత్రం గతికూడానా? మనబోటి వాళ్ళకు కొంపే కైలాసం" రామసీత యీ మాటా శ్రద్ధగా వింది. సున్నిపిండీ,

తువ్వాలూ తీసుకుని నూతి దగ్గరికి వెళ్ళింది. మొహం కడుక్కుందామని నూతిదగ్గరికి వెళ్ళగానే వొంటిమీద నీళ్ళోసుకో బుద్ధిపుట్టింది. చిన్నప్పుడు తను నీళ్ళంటేచాలు, ఎగబడేది. "రోజూ తలారా స్నానంటే" అని తల్లి ఎప్పుడూ కోప్పడేది. అయినా తను ఆగేదికాదు. నవ్వొచ్చింది.. ఇంట్లోకి వొచ్చింది. పాతచీర కట్టుకుని నూతిదగ్గరకు పోయింది. నీళ్ళు పోసుకుంట్టూంటే అత్తగారు అన్నమాట నెమరుకొచ్చింది. "అంత మాత్రం గీతకూడానా? మనబోటివాళ్ళకు కొంపే కైలాసం" రెక్కలు విరుచుకునేవాళ్ళు, దరిద్రులు, గుళ్ళల్లోకి ఎక్కడపోతూ కూచుంటారూ? వాళ్ళకు యిల్లే కైలాసం. వాళ్ళ పాపంకాకపోతేమన్ని ప్రద్దానికీ మా రాజులని ఎందుకంటారు? చాకల్ది మన గుడ్డలు వుతుకుతుంది. మనం దాని గుడ్డలు ఉతుకుతామా? మన గుడ్డలు మనం వుతుక్కుంటాం. తమ చేనుతో చాలకేగా, వాళ్ళన్న కృష్ణమూర్తి యింకోళ్ళ పొలం కూడా కవులు కుచ్చుకుంది. చాలితే పుచ్చుకుంటాడా? అవును. అన్నయ్యా యిదే అన్నాడు. "గుడీ గిడీ మీరుపొండి. నేను చేలోకిపోతా. నాకు చేనే దేముడు." అంటాడు అన్నయ్య. స్నానంచేసి వొళ్లు తుడుచుకుంటుంటే మరొకటి తట్టింది. "అసలు గుళ్ళోకి వెళ్ళక పోతేనేం? జరగదా? యిప్పుడు మాత్రం అందరూ వెళుతున్నారా? దేముడు ఏమన్నాచేస్తే—? ఏమిటోనమ్మా, నాకెందుకొచ్చింది?" అనుకుంది మళ్ళీ. ఉతికిన చీరా, రవికతో వచ్చి మిఠాయి పొట్లంలాగా కూర్చుంది. తోచలేదు, లేచి గది లోకి వెళ్లింది. దీపం వెలిగించింది. మళ్ళీ వొచ్చి కూచుంది. అత్తగారు అన్నంగిన్నె పొయిమీద వేసింది. వెలుతురూ, చీకటీ పోట్లాడుకుంటున్నై. బొద్దింకలు తప్పుకు తప్పుకు పారిపోతున్నాయి, పొయిలో మంటలు గమ్మత్తుగా లేస్తున్నై. అగ్నిహోత్రుడికీ, ఆలోచనలకీ సయోధ్యల్లేపుంది. జ్వాలలు ఆడుతున్నకొద్దీ ఆలోచనలూ ఆడుతై. తను, తనయిల్లు, తన వంశం, తనరక్తం పవిత్రంగా చూసే దేవాలయం మైలపడుతూందన్న

ఆలోచనవొచ్చి ఆమెమనస్సు అతలాకుతలం చేస్తోంది. రకరకాలుగా ఆలోచన పోతోంది. ఎవరు కళపెళ్ళాడినట్టు మనస్సు కళపెళలాడుతోంది. వాళ్ళు మరీ అసహ్యంగా వుంటారు. మురికివోడుతూ వుంటారు. పది చీరలు లేకపోతే తనూ మురికివోడుతూనే వుంటుంది, ఈ మాటతో బాగానే ఆమె మనస్సు జలదరించింది. యిహ యిది ఆలోచించుకో గూడదనుకుంది.

అదృష్టవశాత్తూ పక్క యింటివాళ్ళ పిల్లాడు రాముడొచ్చాడు. పిచ్చివాడు! నాటకానికి తీసికెళ్ళమని అడిగినవాడు మళ్ళీ ఆ మాటే లేదు. ఇంట్లో పెద్దవాళ్ళు కోప్పడ్డారో ఏమో ఎప్పుడన్నా వొస్తాడు. రాటం భుర్రుమని తిప్పిపోతాడు.

'ఏరా రాముడూ, రా.'

రాముడు వొచ్చాడు. కాస్సేపన్నా కూచోలేదు. తుర్రుమని లేచిపోయాడు. ఎందుకొచ్చినట్లు? ఎందుకు పోయినట్లు. పిల్లలింతే. వాళ్ళ యిష్టం, పిచ్చికలల్లే వాలిపోతారు. కాస్త అల్లరీ చేస్తారు సరదాగా వుంటే.

అన్నం వుమ్మగిల్లింది. ఆంజనేయులు వొచ్చాడు. భార్యాభర్తలిద్దరూ ఏక పంక్తిన భోంచేశారు. గర్భిణీ ఐనప్పటినుంచీ రామసీత మొగుడితోపాటే అన్నానికి కూచుంటోంది. అన్నంతిని గదిలోకి వెళ్ళింది. నిద్రపట్టలేదు. సాయంత్రం వొచ్చిన పేపరు చదువు కుంటున్నాడు ఆంజనేయులు.

"ఏమండీ, గుళ్ళల్లోకి వెళ్ళకపోతే ఏమండీ!"

"ఏం వెళ్ళకపోతే—" అన్నాడు పరధ్యానంగా.

"ఐతే మాల—కాదు హరిజనులకు గుళ్ళుతెరవకపోతేనేం?"

'అమ్మయ్యో, అది చేసితీరాలి!'

"దరిద్రులకు అన్నం, బట్టా, తృప్తిగా వొచ్చేట్టు చేస్తే చాలదూ?"

ఆంజనేయులు యిది ఆలోచించలేదు. భార్యకొత్తగా మాట్లాడుతూందనిపించింది. అతను సమాధానం చెప్పలేదు. ప్రోత్సాహకరంగా మాట్లాడక పోబట్టే, కాస్సేపుచూసి రామసీత అటుతిరిగి పడుకుంది.

రాత్రంతా నిద్రపట్టలేదు. తెల్లారింది. అన్నా, వొదినా వొచ్చారు. చలిమిడీ అవీ తెచ్చారు. పురిటికి తనను తీసుకెళ్ళటానికి వొచ్చారు. అన్ననూ, వొదిన్నీ చూడగానే రామసీత మొహం చేటంతయింది. విచ్చిన పెద్దచామంతి పూవులాగుంది ఆమె.

వొదినగారూ, పక్కయింటి ఆవిడా సూడిదలు నలుగురికీ పంచారు. ప్రయాణం. తల్లి 'నాదేముంది నాయనా, మీ యిష్టం, మీ బావ యిష్టం.' అంది. కొడుకు 'నాదేముంది నాయనా, మీ యిష్టం, మీ మేనత్త యిష్టం' అన్నాడు. వొచ్చేందాలతో ఆరోజుకి ప్రయాణం చెడింది.

"ఏమండీ...."

ఆంజనేయులు తలెత్తి చూశాడు.

"మిమ్మల్నే—"

"ఏం."

"మిమ్మల్ని విడచి వెళ్ళటమంటే ఏమిటోగా వుందండీ!" అంది రామసీత.

ఆంజనేయులు నవ్వాడు. ఆ నవ్వు గమత్తుగా వుంది.

"ఏం నవ్వుతారు" అంది.

"లోపల వెళ్ళాలనేమో తొందరానూ, పైకి పైపై ప్రేమలూనూ"

రామసీత మనస్సు చివుక్కుమంది. తాను ఎంత ప్రేమగా అడిగిందో అంత ప్రేమగా అతనువుంటే—? అయ్యోరాత! స్త్రీ పురుషులు

కోరుకునేది యిదే. సామాన్యంగా లభ్యం కానిదీ యిదే. వెళుతూ, వెళుతూ కూడా నాప్పితోటే వెళ్ళాలని రాసుంది కాబోలు అనుకుంది. వొచ్చిన ఊహను ఆమె మింగింది.

"ఈ మాటలకేం గానీండి—"

"అంత పచ్చి అబద్ధాలా?"

రామసీత ఏమీ అనలేదు. లేదన్నట్టు వూరుకుంది. ప్రేమ వుంటే ఏమన్నా అనవొచ్చు, పడవొచ్చుగాని, ప్రేమ కరువైనచోట 'ఆఁ' అంటం అన్యాయం. 'నారాయణా' బూతుమాటే.

"ఏమండీ తీరుబడైనప్పుడు నన్ను చూట్టానికి రారూ!" అంది మళ్ళీ.

"ఎప్పుడూ నాకు తీరుబడేగా!"

లాభంలేదు. ఎత్తు ముదురుతోంది. రామసీత కట్టి పెట్టింది. ఆ రాత్రి తాను ఎంతో మాట్లాడుదామనుకుంది. ఎన్నెన్నో సంగతులు చెబ్దామనుకుంది. లేవబోయిన అల అక్కడే అణగారినట్టు అయింది.

తెల్లారగట్ట రామసీత ప్రయాణం అయింది. వెళుతూ వెళుతూ గాంధీజీ బొమ్మ దగ్గర ఆగింది. ఆ బొమ్మను చూస్తుంటే ఆమెకు ఏదో శాంతంగా వుంటుంది. దరిద్ర నారాయణుడి బొమ్మను తీసుకెళదామనుకుంది. తరువాత వేరే కొనుక్కో గూడదా అనీ అనుకుంది. నిద్రపోతున్న మొగుణ్ణి లేపి చెప్పింది. అతను నిద్ర మత్తులోనే తల వూపాడు. అత్తగారితో చెప్పింది. "సుఖంగా వెళ్ళి లాభంగా రా అమ్మా" అంది. మళ్ళీ గదిలోకి వచ్చింది. మొగుడు లేస్తాడనీ కొంత దూరం వొస్తాడనీ అనుకున్న యిది రాత్రే పోయింది. మళ్ళీ చెప్పిరావటానికి వెళ్ళింది.

'వెళుతున్నా' అంది ముద్దుగా.

అతను తలెత్తి 'సరే' అన్నాడు. ఆమె చిన్నబుచ్చుకుంది. నవ్వుతూ సంతోషంగా పుట్టింటికి వెళ్ళే యిది తనకు లేదు అనుకుంది.

"గాంధీగారి పటం తీసికెళ్ళనా?" అంది. లేచి "వొద్దు, నాకు ఉండాలి" అంటా డనుకుంది.

'ఊ' అన్నాడు మొగుడు.

పటం దగ్గిరికి వెళ్ళింది. "ఇక్కడే వుండనీ, వేరే కొనుక్కుంటాలే" అనుకుంది. బండి ఎక్కింది. బండి కదిలింది.

"అత్త వెళుతోంది. అత్త వెళుతోంది" అంటూ పక్కయింటి వారి అబ్బాయి రాముడు బండివెంట నాలుగడుగులు వొచ్చాడు.

## 3

రామసీత చురుకైన పిల్ల. కిలకిలా నవ్వుతుంది. అన్యాయం అని తోస్తే ఎంత వాళ్ళయినా ఉన్నమాట అనేస్తుంది. ఎంత ఆకాశం విరిగి మీద పడుతూన్నా లెక్కచెయ్యదు. కలుపుగోలుతనంగా వుంటుంది. అలాంటిది బండి కదిలాకగూడా స్తబ్దుగా ఉండేప్పటికి వొదినగారు ఆశ్చర్య పడింది.

"అత్తారింట్లో చాలా మారావమ్మా!" అన్నదామె రామసీతను.

రామసీత నవ్వింది.

"నేను గ్యాపకం వున్నానంటమ్మా!" అన్నాడు బండి తోట్లోంచి నాంచారి.

"ఎందుకు జ్ఞాపకం వుండర్రా" అంది! నాలిక్కొరుక్కుంది. "అందరూ జ్ఞాపకం వుంటారు" అంది. నాంచారయ్య చిన్నప్పుడు రామ

సీతన్ను ఎత్తుకు మోశాడు. వో రోజున వాడిమీద తనకి కోపం వచ్చింది. వాణ్ణి తిట్టింది. కొట్టింది. గిల్లింది. నెత్తురొచ్చింది. "అమ్మగారితో చెప్పనా" అన్నాడు వాడు. రామసీత తెల్లబోయింది తల్లితో చెప్తాననగానే. నెత్తురు కళ్ళ చూసేసరికి భయం వేసింది. చప్పున ఏడ్చింది. దెబ్బతిన్న వాడే సముదాయించాడు.

"కోడెదూడ పెద్దదయిందా?" అంది.

'ఆ'

"ఏరా అన్నయ్యా" అంది అన్న నుద్దేశించి. మళ్ళీ ఆగింది.

"ఏమిటీ—" అన్నాడు అన్న.

"అబ్బే, ఏం లేదు" అంది.

అన్నా వొదినా మొహాలు మొహాలు చూసుకున్నారు.

పుట్టింటికి చేరింది. "రామసీతొచ్చింది. రామసీతొచ్చింది" అని నలుగురమ్మ లక్కలూ చేరారు.

"అలా వున్నావేమే మా తల్లీ—" అన్నారు. "ప్రయాణం కదుటే" అని వాళ్ళకు వాళ్ళే జవాబు చెప్పుకున్నారు. వెళ్ళిపోయారు.

రామసీత వొచ్చినప్పటి నుంచి ముభావంగా వుండబోతుంది. కట్ట తెగినట్టు గబగబా మాట్లాడుతుంది. అణచుకోబోతుంది తనను. అణుచుకుంటోంది కూడాను. పని పాటల వాళ్ళను ఏమన్నా మాట అనదు. అననీదు.

చాకలిది రోజువారి పుతుక్కు వొచ్చింది. "ఏమే—" అని వొదిన పిలిచింది. వెంటనే వెళ్ళింది రామసీత. 'వాళ్ళూ మనలాంటి వాళ్ళే వొదినా, ఎందుకలా అంటావ్—' అంది. వొదినా, చాకలిదీ యిద్దరూ తెల్లబోయారు.

చాకలిది బట్టలు తీసుకు వెళ్ళిపోయాక వొదినగారు దొడ్లోపడి గుంజు కుంటోంది.

"ఏమన్నావే ఏమిటే?" అని తల్లి అంది.

"ఏమీ అనలేదే—"

"ఏమో మరి, దొడ్లోపడి సణుక్కుంటోంది" అంది ఆమె.

రామసీత నేరుగా దొడ్లోకి వెళ్ళింది.

"ఏమమ్మా, నే నేమన్నాననీ—" అంది.

"నేనుమాత్రం ఏమన్నానమ్మా."

"వాళ్ళా మనలాంటి వాళ్ళు అన్నందుకేనా యింతయిదీనూ" అంది రామసీత.

"డాం దుంపతెగిరి! దాన్ని ముందుపెట్టుకుని అంటేగాని తోచ లేదుటమ్మా"

"..........."

"ఇక మళ్ళీ అనగలమా. అలుసు కాముటమ్మా, నువ్వు చెప్పు"

"మాట అనగాలేంది, అలుసౌతామనేనా అమ్మా" అంది రామసీత.

"పురెక్కించు తల్లీ. ఇప్పటికే వాళ్ళకళ్ళు నెత్తిమీది కొచ్చై. నీబోటివాళ్ళు గూడా కలిస్తే".... అందామె.

"మడికట్టుకుని మంచినీళ్ళు తెచ్చుకుంటున్నానరే-కాస్తదూరంగా పొండర్రా అంటే—అమ్మో. వాళ్ళు వింటారా? ఎదురు నవ్వుతారు. నీ దారిన నీవుపో అమ్మా అంటారు" అంది వొదిన, వాళ్ళపల్లదనం చూశావా అన్నట్టు.

'పాపం' అంది రామసీత.

ఈ యిది సాయంత్రందాకా నలుగుడు పడింది. పెద్దలు నలుగురూ అల్లా అనగూడదని రామసీతనే కోప్పడ్డారు. అందరికీ తలోమాటా అప్ప చెప్పాలని అనుకోలేదుగాని, నాల్రోజులుండి పోయేదాన్ని నాకెందుకని వూరుకుంది రామసీత.

తను మాత్రం అందర్నీ గౌరవంగా పిలుస్తుంది. చేతిలో ఏమున్నా, వాళ్లంటే, వాళ్ళకూ్కడా పెట్టి తింటుంది. దీనికిదో పిచ్చి అని పుట్టింటి వారూరుకోలేదు. మూతులూ, ముక్కులూ విరుచుకుంటూనే వుండేవారు.

పాలేళ్ళు, చాకలిది మొదలయినవాళ్ళు ఆమెతో కష్టాలూ, సుఖాలూ వెళ్ళబుచ్చుకునేవాళ్ళు. చిరుగులచీరతో పాలేరు నాంచారి కూతురువొస్తే తనచీరల్లో కాస్తగట్టిది చూసి యిచ్చింది. నల్లరాయిలాంటి చీర వాళ్ళ ఎదాన కొట్టిందని ఆరోజు మాటపడింది. ఆమె, 'ఇస్తేయిచ్చాలే, మీరు గూడా యివ్వరాదూ' అంది.

క్రమక్రమంగా నెలలు నిండుతున్నై. 'నీకెందుకు, నువు కూచోవే' అన్నా, పనిలో కొచ్చేది. "కూరలు తరగడమైనా సరే చేస్తాను. ఊరికే కూచుని తింటం తప్పుకాదూ" అనేది. ఇంకా కాపరానికిపోని పిల్లలకు పూసలకుట్లు నేర్పింది. పూలతో పతాలు అల్లడం నేర్పింది. ముఖ్యంగా గ్రామప్రజలందరూ మనలాంటివాళ్ళే అంటుంది. చిన్న పిల్లలు మొదట్లో నవ్వారుగాని—తరువాత్తరువాత చెవొగ్గారు. "వాళ్ళు ఏడిస్తే మనం బాగుపడం" అనేది. మొగుడు చూట్టానికి రాలేదు. ఉత్తర మన్నా రాయలేదు. వోసారి రమ్మని రాయిద్దామని ఆమె చాలా అనుకుంది. ఎటుపోయి ఎటువొచ్చి వికటిస్తుందో అని అనుకుని వూరుకుంది.

మొగుడు వొక్కసారన్నా వొచ్చి మనసారా మాట్లాడితే చాలా సంతోషించేది. నిజమే. కొన్ని ప్రాణులు సంతోషించటానికీ, సుఖపడ

టానికీ పుట్టవు. సంఘానికై వెంపరలాడుతాయిగాని, సుఖం అనేది దక్కదు. ఆరాటమే మిగులుతుంది.

అత్తారింటి కెళ్ళాక చదువుకోడం మూల పడింది. ఎప్పుడూ ఏదో యిది మనస్సు నిండి ఉండేది. దాంతో ఆమె కిందా మీదా అవుతుండేది. ఇప్పుడామె మళ్ళీ కాస్త చదువు ధోరణిలోకి పడింది. నెమ్మది నెమ్మదిగా కూడ పలుక్కుంటూ చదవటం మొదలెట్టింది.

మొగుడు ఉత్తరమ్మొక్క రాయడని తెల్చుకుంది.

తాను రాద్దామని నిశ్చయించుకుంది. తప్పేంలేదుగదా. మొగుడికి పెళ్ళాం రాయటం తప్పా? ఉత్తరం ఎలా రాయాలో తోచలేదు. ఎలా ప్రారంభించాలో ఎంత సేపటికీ అంతుపట్టలేదు. ఎలాగో అలా నాలుగు ముక్కలు రాసింది. పాలేరు చేత పోస్టులో వేయించింది. ఎన్నాళ్ళకూ సమాధానం రాలేదు. లాభం లేదనుకుంది.

రామసీత ప్రసవించింది. మొగపిల్లాడు. తల్లిపోలికే అంటే తల్లి పోలికే అన్నారందరూ. తనకూ అల్లాగే వుంది. ఐనా నెల గుడ్డునుచూసి ఎలా పోలికలు చెప్పటం? పిల్లాణ్ణి చూస్తున్నకొద్దీ చూడ బుద్ధి పుడుతోంది. ఆ చిట్టిముండ గుప్పిళ్ళు బిగపడతాడు, వొళ్ళు సాగ దీసుకుంటాడు. బుల్లినోరుతో కళ్ళుమూసుకుని ఏమిటో వెతుకుతాడు. మొగపిల్లాడు పుట్టాడని ఆంజనేయులుకు కబురు చేశారు. అతను రాలేదు. కానీ వెళ్ళినవాళ్ళు అతను మళ్ళీ నాటకాల్లో పడ్డాడనీ, యీమధ్యనే నాల్గెక రాలు అమ్మాడనీ వార్త మోసుకొచ్చారు. బాలింతరాలు రామసీత యిది విని రిచ్చపడింది. తనలో తాను మల్లాగుల్లాలు పడింది. వితర్కించు కుంది. ఉన్నదికాస్తా క్షవరం ఐపోతోందని మధనపడింది.

"పోతే పోయింది. ఆయన కుదురుగా వుంటే—" అనుకుంది.

గదిగుమ్మానికి కట్టిన చెప్పు, కలబందా కనబడ్డవి. చప్పున గుర్తు కొచ్చింది. పిల్లాణ్ణి చూసింది. "బ్రాహ్మడి కూతురు మాదిగాడి పెళ్ళాం" అని రెండుమూడుసార్లు అంది. అసలీ కథేమిటో? ఆ బ్రాహ్మడి కూతు రెవర్తో, ఆ మాదిగాడూ ఆ బ్రాహ్మడి కూతురూ ఎలా కాపురం చేశారో? కలిసిమెలిసున్నారో, కొట్లాడుకు చచ్చారో? ఆఅమ్మాయి జన్మంతా ఎంత కుళ్ళికుళ్ళి ఏడ్చిందో....ఎన్నెమ్మకు ఈ పాట పాడితేసరి, రాదుట. ఆ పురుక్కీ ఈ పాటకీ ఏమిటో సమ్మంధం?

పథ్యం పెట్టారు. పురుడు సుఖంగానే వెళ్ళింది. నూతిలో చేద వేసేనాడు పేరుచెప్పి రావడం సిగ్గువేసింది. ఫలానావారి బిడ్డేను సుమా అని చెప్పడమా అనుకుంది. చీదరించుకుంది, నేను చెప్పను పొమ్మంది. "ఇది ఆచారమే, జరగాలే" అని తల్లి నెత్తినోర్నరు పెట్టుకుని చెప్పింది. రామసీత ఎదురు తిరిగింది "నన్ను నమ్మితే నమ్మండి "అంది. ఆమాట అంటూంటే ఆమె కళ్ళల్లో జ్వాల భగ్గుమంది. తల్లి నోరుమెదపలేక పోయింది. 'నలుగురూ....' అంది తల్లి.

"గంగలో కలపమను—సాటి మనుషుల్ని తేలికగా మాట్లాడే వాళ్లుట, చెప్పొచ్చారుట" అని రామసీత విరుచుకు పడింది. కాళీఅవ తారం చూసి అందరూ నోరు నొక్కుకుని చక్కా పోయారు. 'చిన్న ప్పటి నుంచీ అదంతే—' అందొకావిడ. అది రామసీతకు తెలిసింది. "ఐతే అయ్యాలే" అంది. అంతే.

నెలపురుడు వెళ్ళింది. ముత్తవవల్లి బిడ్డడి చేతికి వత్తులూ అవీ చేయించి పెట్టింది. తండ్రితో శతపోరి రామసీత కొడుకుమొలకు గజ్జెలు చేయించింది. గుడ్డటోపీ, చొక్కా తొడుక్కుని పసివాడు తొట్లో గిల క్కాయలు చూసి సంబరపడుతున్నాడు. ఓరోజు మధ్యాన్నం భోజనాలు చేసి ఆడవాళ్ళందరూ సావిట్లో కూచున్నారు. లోకాభిరామాయణం విడి పడ్డది. ప్రవాహం వెళ్ళి వెళ్ళి ఆంజనేయులు మీదికి వెళ్ళింది.

"ఇప్పటికైనా వొచ్చాడేమో చూశావా?" అంది రామసీత తల్లి. ఆవిడా పెద్దదయింది. పచ్చగా, పార్వతీదేవిలా వుంటుంది. పొద్దున్నే ఆమె ముఖం చూసినాచాలు, పాపాలు పరిసిపోతయ్యంటారు అందరూ. ఆపెడ కెప్పుడూ యిదే దిగులు. ఒక్క కొడుకూ, ఒక్కత్తే కూతురూనూ. దేముడి దయవల్ల కలిగిన యింట్లో పుట్టి, కలిగిన యింట్లోకే వొచ్చింది. పుట్టింటివారు ఆమెకు పసుపూ కుంకం కింద నాల్గెకరాలు కూడా యిచ్చారు. కొడుకు నలుగురితోపాటు సంసారం చేస్తున్నాడు. మొగుడు ఏమీ తక్కువవాడు కాడు. నాలుగట్లాలు నలుగురికీ చెప్పి అవుననిపించు కున్నవాడే. ఒక్కకూతురుంటే—అది యిలా తయారైంది.

దాని కడుపున గూడా ఓ కాయ కాచింది గదా అని సంతోషించింది ముసలమ్మ. అల్లుడు తడిసిన నులక్కుక్కిలాగా ఎప్పుడూ బిర్రబిగిసే వుంటాడు. అదో వినపనకొయ్య. రామసీత అక్కడే కూచుని పిల్లాడికి ఊలుటోపీ కుడుతోంది. నెమ్మదిగా "అమ్మా" అంది.

తల్లి తలెత్తి చూసింది. ఎంతసేపటి నుంచో మాట్లాడని రామసీత నోరు విప్పేసరికి తల్లీ, వొదినా ఆమెకేసి చూశారు.

"నాపెళ్ళప్పుడు ఏమయిందే?" అంది. ముసలమ్మకు అర్థం కాలేదు. ఆవిడ శూన్యంలోకి చూస్తోంది. ఆమె ముఖాన పెద్ద కుంకుమ బొట్టు మెరిసింది. తల్లికి తాను అడిగేది అర్థంకాలేదనుకుంది రామసీత. ఇంకావిప్పి అడగటానికి పక్కయింటావిడ వుంది.

పక్కయింటావిడ యిది గమనించింది. 'వెళ్ళొస్తానమ్మా పార్వతమ్మత్తా' అని వెళ్ళిపోయింది. రామసీత తల్లిని పార్వతమ్మ అంటారు. అసలావిడ పేరు సుబ్బమ్మ. నలుగురూ పార్వతమ్మ అనే అంటారు; వరసతోకలిపి.

"మేనరికం నీవు వొద్దన్నావా?" అనడిగింది రామసీత.

పార్వతమ్మకు చిత్రం వేసింది. తనకూతురు తనను నిగ్గతీస్తోంది. మంచో చెడో జరిగిపోయిన సంగతిని అసలువాళ్ళు, అందులో తమ బిడ్డలు వొచ్చి నిలవేసి అడిగితే జవాబు చెప్పడం కష్టం.

"ఎందుకే యిప్పుడవన్నీనూ" అంది. ఆవిడకు పాత కథ కళ్ళ ముందు తిరుగుతోంది. తాంబూలాలు ఆ రోజున పుచ్చుకుంటారు. తనకు సుతరామూ యీ మేనరికం యిష్టంలేదు. 'మా అక్కయ్య—' అన్నాడు తనభర్త. అప్పావుధాన్లుగారంటే ఆ ప్రాంతాల్లో పేరెన్నికగన్న మనిషి. చిన్నప్పుడు ఆయన కనకమ్మ అక్కగారింటో వుండి తింటూ వేదం చదువుకున్నాడు.

'మా అక్కయ్య వుసూరుమంటుంది' అన్నాడాయన.

"పిల్ల వుసూరుమనదూ" అంది తను.

కాబోయే అల్లుడు వీధి అరుగుమీద ఎవర్నో యిద్దరు ముగ్గుర్ని చేర్చాడు. తువ్వాలా తలకు చుట్టాడు. బీడీ అంటించాడు. నాటకాల్లో పద్యాలు పాడుతున్నాడు అప్పుడు. నేలను నాకే వారగోచీ, వలబనీనూ, బనీను కనబడేట్టు సన్నని చొక్కా, నుదురుమీదపడే క్రాపింగూ, లుంగ చుట్టి ఉత్తరియ్యం మెడను వేసుకోడమూ, ఎంతెంతవాళ్ళనూ లుస్కారించి మాట్లాడ్డమూనూ అయ్యేపని. అప్పావుధాన్లుగారు కాసేపు మాట్లాడలేదు.

'చదువూసంధ్యలు లేకపోతే పోయింది. కుదురైనా లేదుగదా" అంది తను.

ముసిలాయన ఆలోచన్లో పడ్డాడు.

అరుగుమీంచి ఝామ్మని పద్యం మోగుతోంది.

"ఈ కుండలి నన్ను దాగరిచె
క్రూరతనింక మనంగ జాలనో
అండజయాన!"

"వీధిలోకి వెళ్ళి అల్లుణ్ణి దర్శనం చేసుకురండి; రేపు కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకుందురుగాని!" అంది.

అవధాన్లు ఉక్కిరిబిక్కిరైనారు.

"ఎప్పుడో మా అక్కయ్య ముక్కుల్లో చీమిడి తీసేసిందని—కడుపున పుట్టిన బిడ్డగొంతుక పిసుకుతారుటండీ!" అంది.

ఇంతలో రామసీత అక్కడికి వచ్చింది. "రా అమ్మా!" అని తండ్రి కూతుర్ని వొళ్ళోకి తీసుకున్నాడు. తలనిమిరాడు.

కళ్ళల్లోకి చురచుర చూసి పార్వతమ్మగారు అక్కడి నుంచి వంటింటోకి వెళ్ళింది, యింట్లో అలికిడైతే.

"ఏరా అన్నయ్యా" అంటూ కనకమ్మ వొచ్చింది. తాంబూలా లుచ్చుకున్నారు అన్నాడు. ఇదంతా ఆమెకు కళ్ళకక్కట్టినట్టు కనిపించింది. ఫలితంగూడా చూస్తున్నదేమో. కళ్ళంబడి నీళ్ళు వొచ్చై. చెంగులు తుడుచుకుంది. ముసిలాయన యింతలో ఎందుకో పిల్చాడు. దొడ్డి వసారాలోకి ఆమె వెళ్ళిపోయింది.

"ఏమే అమ్మా!" అంది రామసీత.

"నిజమేనే అమ్మా. ఒద్దన్నాను." అని వెళ్ళింది పార్వతమ్మ. ఆమె గొంతుకలో ఏదో ఉండనిండి మాట పెగిలి రాలేదు.

రామసీత అత్తారింటికి ప్రయాణం అయింది. తను కుట్టిన ఊలు టోపీ కొడుక్కు తొడిగింది. నల్లని చొక్కా తొడిగింది. మొలకు గజ్జెలు కట్టింది. చేతిని వొత్తులు మెరుస్తున్నై. నెమ్మది నెమ్మదిగా చేవ విరిగి పసుపురంగు తేలుతున్నాడు పాపాయి.

కొడుకు నెత్తుకుని తండ్రి దగ్గిరికెళ్ళింది.

"మాహం బ్రహ్మనిరాకుర్యాం, మామా బ్రహ్మనిరాకరోత్— అనిరాకరణమస్తు. అనిరాకరణం మే అస్తు." అని మంచంలో పడుకుని అప్పావుధాన్లుగారు గొణుక్కుంటున్నారు.

'నాన్నా, వెళ్ళొస్తా' నంది రామసీత.

ఆయన ఏదో చెప్పబోయారు. లేచి కూచున్నారు. మాట తడబడ్డది. పిల్లవాణ్ని తండ్రి చేతికి యిచ్చింది. మనవణ్ని ఎత్తుకున్నారు. ఆమె తండ్రి కాళ్ళకు నమస్కరించింది. తండ్రి వారుగై పోయాడు. పూర్వకాలం మనిషి గనుక యింకా వున్నాడుగానీ, తండ్రి కూతుర్ని దీవించాడు. మనమడు తాతగారి ధోతీ తడిపాడు. 'అరి వెధవా' అంది రామసీత. తాత ఆనందంగా నవ్వాడు.

'అమ్మా, నేను సన్యసిద్దామనుకుంటున్నాను.' అన్నాడు.

"ఈ వయస్సులో వద్దు నాన్నా" అంది.

"ఇదేనమ్మా వయస్సు. నా తండ్రి యజ్ఞం చేశాడు. నా తాత బ్రహ్మీభూతుడు. నా మాతామహుడు ఆధానం చేశాడు. నేను వైశ్య దేవం అయినా చెయ్యలేక పోయాను. సన్యసిద్దామని వుందమ్మా." అన్నాడు.

రామసీత గంభీరురాలయింది. రక్తమాలిన్యం లేనివంశం. ఆ ప్రతిష్ట యివాల్టికీ ప్రజ్వరిల్లుతోంది. ఆమెకు దరిద్ర నారాయణమూర్తి గాంధీగారు గుర్తుకొచ్చారు.

'నాన్నా, వొక్క మాట చెప్పనా?' అంది.

'చెప్పమ్మా' అన్నాడు తండ్రి.

'మనిషికంటే దేముడెవరునాన్నా' అంది.

తండ్రి ఆశ్చర్యంతో, ఆనందంతో కన్ను లరమోడ్చాడు.

'సాటి మనిషిని హింసించి, హింసించి చంపి, ఎన్ని యజ్ఞాలు చేస్తే ఏం నాన్నా' అంది.

అప్పావధాన్లుగారు తెల్లబోయారు.

'నీ వొళ్ళు మాత్రం ఏం బావుంది నాన్నా. సన్యసించకు నాన్నా." అంది.

అప్పావధాన్లుగారు మాట్లాడలేదు.

'నా ప్రాణాలు నీమీదా, అమ్మమీదా వుంటై. ఇప్పుడు ఈ మహా రాజు(కొడుకు) మీదానూ. నీ ఆరోగ్యం వారానికో మాటన్నా రాయించు నాన్నా. 'మేం జవాబన్నా రాయమనుకో. నా కోసం మీ ఆరోగ్యం రాయించాలి నాన్నా' అంది.

'అలాగే అమ్మా' అన్నాడు తండ్రి. మాట్లాడలేక పోయాడు. 'సన్యసించ వొద్దు నాన్నా' అంది.

అవధాన్లుగారు తల వూపాడు. మళ్ళీ తండ్రి కాళ్ళకు నమస్కరించింది. ఆయన వేదోక్తాశీర్వచనం చేశాడు. పిల్లవాణ్ణి చేతికిచ్చారు.

"బయలుదేరవేమే—" అంటూ అన్నగారు వొచ్చారు. "వెళ్ళొస్తానే అమ్మా" అని చెప్పింది. పిల్లాణ్ణి తల్లి చేతికిచ్చింది. తల్లికీ వొదినగారికీ పాదాభివందనం చేసింది. తల్లి దీవించింది. వదినగారు కుంకుమ బొట్టు పెట్టింది. బండి ఎక్కింది. దార్లో అన్న— 'రామసీతా!' అన్నాడు.

తలెత్తింది.

'నీవు ధైర్యంగా వుండు. నీకేమో మొగబిడ్డకూడా పుట్టాడు. అన్నాడు. మొగపిల్లాణ్ణి కంటే అక్కడికో మెట్టు ఎక్కినట్టు. కోర్టు' కెళ్ళినా ధోకాలేదు అన్నమాట.

'నీవు ధైర్యంగావుండు. ఆ పశువు, వాడెప్పుడూ అంతే. పిల్లాణ్ణి చూట్టానికైనా తల్లీ, కొడుకూ యిద్దర్లో ఒక్కరన్నా రాలేదు. వాళ్ళవరస తెలుస్తూనే వుంది.'

రామసీతకు ఏమనాలో తోచలేదు. అన్నకేసి చూస్తోంది.

'నీకేం ఫరవాలేదు. నీవు ఏమీ చెయ్యవు. ఏంచేసినా నేనున్నంత కాలం మరేమీ యిదిలేదు' అన్నాడు.

'నాన్నా, అమ్మా కులాసా రాయవుట్రా.' అంది ఆమె.

అత్తారింటి కొచ్చింది. ఆంజనేయులు వూళ్ళో లేడు. ఎక్కడికో నాటకాలకని వెళ్ళాడు. కనకమ్మ వుంది. ఆవిడ దిష్టి తీసింది. ఎర్ర నీళ్ళు తీసిపోసింది. ఉయ్యాల తొట్టి వేశారు. బారసాల జరిగింది. అందరూ వొచ్చారు. ఎల్లాగోఅల్లా వోపిక చేసుకుని అప్పావుధాన్లుగారు కూడా వచ్చారు. బారసాల పీటలమీద ముత్తవ, పాపాయికి రెండెకరాలు చదివించింది. తాతగారు అల్లుడికి ఏరికోరి ఖద్దరు పంచెలు తెప్పించి మరీ పెట్టారు. అల్లుడు మారాడని ఆయనకు ఏం తెలుసు? ఎప్పుడో కూతురు చెప్పిన మాట గుర్తుంది ఆయనకు—అంతే.

ఆంజనేయులుకు కొత్త పిచ్చి పట్టుకుంది. నాటకాలు, రాటం, ఏకులు, ఆసు, చిలపలూ మూలపడ్డాయి. వాకిట్లో ఓ పాతతుక్కు మోటారు ఒకటి వెలిసింది. దాన్ని అన్ని అడ్డగోలు డొంకల్లోంచీ నడి పించుకు వచ్చాడు. ఇప్పుడాతను కారు తోలగలడు. చిన్న సర్వీస్ ఒకటి పెట్టాట్ట. మరో నాలుగెకరాలు అమ్మాడు—పిల్లాడు రేపోమాపో పుట్టా డనగా.

కాపరం బస్తీకి తర్లింది. ఆంజనేయులు మూడురోజులకూ నాలుగురోజులకూ ఓసారి యింటికి వస్తాడు. ఓ పూటో అరపూటో వుంటాడు. ఎవళ్ళో వచ్చి పిలుస్తారు. వెళ్ళి పోతాడు.

రామసీతకు పసివాడితో పొద్దు కాస్తున్నా తెమిలేదికాదు. తెమిలిన కాస్తా చదవడమూ, రాటం తిప్పడమూ చేస్తోంది.

రామసీత వీపు గట్టితనాన్నిగూడా పరిశీలించుకోవలసిన రోజులొచ్చై. ఆంజనేయులు ఓ పట్టాన యింటికిరాడు. వొస్తే వొకటి రెండు రోజులు కదలడు. ఎప్పుడూ చిరచిరలాడుతూ వుంటాడు.

రామ్మూర్తి (కొడుకు) అల్లరి చేస్తుంటే అతనికి ముద్దురాదు. కోపం వస్తుంది. రామసీతకు కోపంరాదు. ముద్దు వొస్తుంది.

'వీడి గజ్జెలతాడు ఏంచేశా?' అన్నాడోరోజున భార్యతో.

'జాగర్తగానే వుంది ఏం?' అంది రామసీత.

"కావాలి"

"ఎందుకు?"

'డబ్బులు పుట్టించుకు రావాలి'

'తాకట్టు పెట్తారా, మంచిమాటే. ముందే చెప్పారు నయం,'

ఆంజనేయులు 'తే' అన్నాడు. గొంతికలో శఠ తొణికిసలాడుతోంది.

'నేనివ్వను'

'ఇస్తావా, ఇవ్వవా?'

'చంపినాసరే యివ్వను'

ఆంజనేయులు బలవంతాన ఆమె పెట్టె తీయబోయాడు. రామసీత అడ్డం వెళ్ళింది. ఆమెనొక్క తోపు తోశాడు.మళ్ళా అడ్డం వెళ్ళింది. ఆంజనేయులుకు కోపం వచ్చింది. కొట్టాడు. దెబ్బతిన్న రామసీత తాచుపాం అయింది. కానీ వెంటనే తలొంచుకుంది.

'ఏమయినాసరే—వాడివి నేనివ్వనండీ!' అంది ఏడుస్తూనే.

"నీ అబ్బసొమ్మా?"

నోరు జారింది ఆంజనేయులుకు. అనేశాడు.

"ఆ, నాఅబ్బసొమ్మే"అంది రామసీత నిప్పులుకక్కుతూ. చేసేది లేక ఆంజనేయులు వెనకడుగువేశాడు. తనమెళ్ళో గొలుసుతీసి యిచ్చింది రామసీత మొగుడికి. ఆంజనేయులు నిర్విణ్ణుడైనాడు. పుచ్చుకోడమా, వొద్దా అనుకున్నాడు. వొద్దనుకున్నాడు. తీసికెళ్ళి భార్యకిద్దామని లేచాడు. అవసరం నెత్తెక్కి తొక్కుతోంది. కాయకు పైరు కొనాలి. దర్జాగా తీసుకున్నాడు. చొక్కా తొడుక్కుని వెళ్ళిపోయాడు. అత్తగారు కిమిన్నాస్తి. కళ్ళప్పచెప్పి చూస్తూ వూరుకుంది.

రామ్మూర్తికి రెండేళ్ళు నిండై. ప్రతివాళ్ళనూ తిడతాడు. కొడతానంటాడు. కర్రముక్క పుచ్చుకుని బయలు దేరుతాడు. ఎప్పుడూ దుమ్ములో ఆడుకుంటాడు. చొక్కా తొడగటం అంటే భయంవేస్తోంది. నిమిషంలో మన్నుచేసుకువస్తాడు. ఎప్పుడూ దిసమొలగానే వుంటాడు.

"ఓ రామయ్యతండ్రీ, నే వేగలేకున్నానురా నీతో!" అంటుంది రామసీత.

"అమ్మా, అమ్మా, వాళ్ళబ్బాయిని కొట్టిరానా?"

"తప్పు" అని కళ్ళు పెద్దవి చేస్తుంది రామసీత. ముక్కుమీద వేలు వేసుకుంటుంది.

'తప్పా?'

'ఊ'

'తప్పంటే?'

తెల్లబోయింది రామసీత. తనకొడుకు కొడతానని కర్రముక్క పుచ్చుకున్నప్పుడల్లా ఆమె ప్రాణాలు రువ్వురువ్వుమనేవి.

వో రోజున ఆంజనేయులు కూచుని వున్నాడు. రామ్మూర్తి "నాన్నా నాన్నా" అంటూ దగ్గిరికెళ్ళాడు. ఆంజనేయులు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

'నాన్నా, వాళ్ళబ్బాయిని కొట్టిరానా?'

'ఊ!'

రామ్మూర్తి లేచాడు. కర్రముక్క తీసుకున్నాడు. రామసీత ఇదంతా చూసింది. దబదబా వొచ్చింది.

'ఎక్కడికిరా?'

'ఆల్లింటికి'

'ఏడిశావు. దా. నీకు జెండా చేసిపెట్టనా....'

'జెండా. జెండా చేసిపెట్టు.'

చీరముక్క తుంచింది. మంచంలోంచి కాస్త నులక కోసి తెచ్చింది. ఎల్లాగో అల్లా జెండా చేసి యిచ్చింది. రామ్మూర్తి నవ్వుతున్నాడు. జెండా చేతికి రాంగానే కిలకిలా నవ్వాడు, ఎగిరి గంతేశాడు. 'జై' అంది తల్లి. రెట్టింపు అల్లరితో 'జై' అని అరిచాడు కొడుకు.

'ఎవర్నీ కొట్టగూడదు' అంది.

"జెండాతో గూడానా?"

'ఆ. కొడితే జెండా కోప్పడుతుంది.'

'కొట్టనులే' అన్నాడు రామ్మూర్తి.

'నాన్నా, జెండా....ఎవర్నీ కొట్టగూడదు. జెండా కోప్పడుతుంది.' అన్నాడు వాడు.

ఆంజనేయులు 'బాగానేవుంది' అన్నాడు. గొంతులో ఏ రసమూ ప్రస్ఫుటం కాలేదు. మాట్లాడకుండా రామసీత వెళ్ళిపోయింది.

మైనరు ఉన్నాడు గనుక ప్రామిసరీ నోట్లకు డబ్బులు రావడం లేదు. పగడాల తావళమూ, పుస్తెలతాడూ, ముసిలమ్మ రుద్రాక్షల తావళమూ హారతి కర్పూరం అయింది. రైతు దగ్గరకెళ్ళి పైసంవత్సరం పంటకూడా తెచ్చుకు తగలేయడం గూడా అయింది. ఆ మోటారుకారు "తేతే" అంటుందేగాని 'తీసుకో' అని ఒక్కనాడూ అనదు. కారు కిందే ఖర్చవుతోందో, మరేమవుతోందోగాని, బూడిదలో పన్నీరు చాలా పోశారు.

'జెండాకూ జై!' రామ్మూర్తి అరుస్తూ ఆడుకుంటున్నాడు. అప్పావధాన్లు గారికి సుస్తీగా వుందని వుత్తరం వొచ్చింది. ఆంజనేయులు వూళ్ళోలేడు. రామసీత కుప్పకూలినట్లు కూలింది. కనకమ్మ కాలుకాలిన పిల్లిలాగా తిరిగింది. నుంచోలేదు, కూచోలేదు.

"జెండాకూ జై!"

'రాముడూ, దా' అంది రామసీత.

వొచ్చాడు.

'అరవకూడదు—

'నువ్వేచెప్పావుగా?

'ఇపుడు అరవకూడదు. తాతయ్యకు సుస్తీగా వుందిట!'

'అమ్మా, అరిస్తేనే పోతుంది.ఇందాక మేకపిల్ల భయపడి పోలా?'

రామసీతకు నవ్వురాలేదు. అరవకూడదమ్మా అంది. గదిలోకి వెళ్ళి రెండుమూడు చీరలూ, పిల్లాడికి బట్టలూ తీసుకుని మూటకట్టింది. కనకమ్మవొచ్చి సావిట్లో కూచుంది. ఆవిడ మొహాన కత్తివేస్తే నెత్తురు చుక్కలేదు. ఎంత యిదైనా రక్తసంబంధం. తల్లితోడు. పేగు తోడు తోంది—అన్నకు ఆ వయస్సులో సుస్తీ అంటే ఏమిటి? కళ్ళనీళ్ళను ఆపుకుంటోంది.

'బయలుదేరవూ అత్తయ్యా' అంది రామసీత.

'వాడు లేడే అమ్మా!' అంది అత్తగారు.

'నేనుండలేను, పోతున్నాను' అంది రామసీత.

'వెళ్ళగానే కార్డుముక్క రాయి! వాడు రాంగానే నేనూ వస్తా' నంది కనకమ్మ.

'వొక్కత్తెవూ ఎలా వెళ్తా'వంది మళ్ళీ.

ఈ వంకను ప్రయాణం ఆగుతుంది కాబోలు ననుకుంది రామసీత.

'నోరుందిగదా అడుగుతాను, వెళ్తాను:"

'బస్సుమీదే వెళ్తావా?'

'ఆ'

'..........'

'నాపెట్టె అడుగున అయిదురూపాయలు దాచానిన్నాళ్ళూ. అది తీసుకువెళ్తున్నాను.మీ అబ్బాయికి చెప్పండి. వారినిగూడా ఓసారి రమ్మని చెప్పండి. కూతురునిచ్చుకున్నా మేనమామే. వాస్తే ఎవ్వరూ నవ్వరు!' అంది....పిల్లాణ్ణి చంకనేసుకుని మూట పుచ్చుకుని బయలుదేరింది. సందు చివరి దాకా అత్తగారూ వచ్చింది. కోడలు అన్న చివరి మాటకు ఆమెకు భగ్గుమంది. ఐనా, యిప్పుడు కాదని తమాయించుకుంది. పిల్లాడు పుట్టి నప్పుడు రాలేదని చెప్పడం, ఎంత ముసలిదాన్నైనా అర్థంకాకపోదు? అనుకుందామె.

తను యింటికి చేరేప్పటికి వీధివాకిట్లో పెట్టుకుని ఏడుస్తుంటా రేమో అని ఆమె బహు బాధపడింది. చూపులన్నా అందుతయ్యో అందవో అని మధనపడింది. ఈ వయసులో తల్లియిది గుర్తుకొచ్చి మరీ మరీ యిదయింది. బిక్కమొహం పడ్డది.

రామసీత వొచ్చిందంటే రామసీత వొచ్చిందన్నారు. తల్లిబావురు మంది. అప్పావుధాన్లుగారు, ఆసన్న మృత్యువు మంచాన్నే అంటి పట్టుకుని వున్నారు. స్పృహ ఏమీ లేదు. విరోచనాలు ప్రారంభం అయినవి·

పోసిన మందులు వంట పట్టడంలేదు.

'అమ్మాయి వొచ్చిందా?' అన్నాడు.

'ఆ. వొచ్చానాన్నా'

'వొచ్చావా. అమ్మా దా.'

వివస్త్రుడు. నులక మంచం మీద గోనెపట్టాలో పడుకునివున్నాడా. వేసే పొత్తిగుడ్డ వేస్తున్నారు, తీసేది తీస్తున్నారు.

'నీ పిల్లాడేడీ?'

'ఇడుగో.'

'తాతయ్య!' అని కొడుక్కి చూపించింది రామసీత.

'తాతయ్యా' అన్నాడు రామ్మూర్తి.

తాతగారు కళ్ళెత్తి చూశారు. 'నాన్నా, తాతయ్యకు నుస్తీ.' అంది రామసీత. ఏడుస్తోంది.

'జెండాకు జై—' అరిచాడు రామ్మూర్తి

'తాతయ్యా!'

'ఊ'

'షోరా.'

అందరూ నవ్వారు, తాతగారునవ్వారు, రామసీత 'జై' అని అరిస్తే పోవటం ఏమిటో విప్పి చెప్పింది. 'హారి భడవా' అని అందరూ అంగలార్చారు. అప్పావుధాన్లుగారు నవ్వారు. వెలిసిపోయిన గుడ్డ లాగుంది ఆ నవ్వు.

వైద్యుడు శేషాచార్లు వచ్చాడు. నాడి చూశాడు. పూర్ణమి దాటదని చెప్పాడు. ముసిలమ్మ గొల్లుమంది.

మర్నాడు తండ్రి దగ్గర రామసీత కూచుంది. మిగతా అందరూ భోజనాలు చేస్తున్నారు. రోగి దగ్గర వొకరు వుండడం మిగతావాళ్ళ గబ గబా అన్నాలు కానివ్వడం రివాజు అయింది. 'అమ్మా'

"ఏం నాన్నా"

"ఇవాళ దాహం ఒకటి కొత్తమ్మా"

'అల్లాగా' అంది రామసీత. ఉద్ధరిణతో కాశీనీళ్ళు గొంతుకలో పోసింది.

"అమ్మా"

"ఓయ్"

"ఇహ నే సన్యసించ వొచ్చా అమ్మా"

రామసీత తెల్లబోయింది. తాను వద్దన్నది గుర్తుకొచ్చింది. అందువల్లనే ఆగాడు కాబోలు తండ్రి అనుకుంది. పెద్ద నిట్టూర్పు వొచ్చింది. మొహం గమత్తుగా మారింది.

'సన్యసించాలని వుందా నాన్నా' అంది. ఆ మాట అనటం అన వసరం. అయినా ఆగలేక అంది.

'ఆ రోజున—'

'అర్థమయింది నాన్నా'

'దొడ్డి వసారాలో పడుకుని వున్నాను. నువ్వు వెళ్తూ వెళ్తూ వద్దన్నావు. అప్పుడు ఎదురు చెబితే ఎక్కడ శపిస్తావో అనిపించిం దమ్మా' అన్నాడు.

రామసీతకు కళ్ళంబడి నీళ్ళు వొచ్చై. చెరుగుతో తుడుచుకుంది.

ఎ.పి. బ్రౌన్ గ్రంథాలయము, కడప
ప్రవేశ సంఖ్య
తేది


'నీ వుసురు నాకు తగల కూడదు. తగల నీకు—'

'అవేం మాటలు నాన్నా'

'కాదమ్మా, నీ సుఖం నే చేతులారా చిచ్చెట్టా' అన్నాడు.

ఆ ప్రాణికి ఆ అంతిమఘడియల్లో కళ్ళ నీళ్ళు వొచ్చాయి. బడబాగ్నిని ఎంతకాలం దాచుకున్నారో ఆయన.

రామసీతకు కళ్ళనీళ్ళు వొచ్చై.

'ఇప్పుడెందుకు నాన్నా—' అంది రామసీత. తండ్రి వినిపించుకో లేదు. ఆయన చెప్పదలుచుకుంది చెప్పేస్తున్నాడు. ఇక ఆగదు ప్రాణి.

'మీ అమ్మపేర వున్నది నీపేర పెట్టించా. తేతే అని రేపు వాడె క్కడ నిన్ను చంపుతాడో అని నీవు అమ్మటానికి వీల్లేకుండానూ, నీ పిల్లాడికి చెందేట్టూ రాయించా....' అన్నాడు.

రామసీత కొత్తలోకంలో వుంది. తనను తలుచుకుని తండ్రి ఎంత కుళ్ళి కుళ్ళి ఏడ్చాడో.... తండ్రి మొఖంకేసి పరీక్షగా చూసింది. తపశ్శక్తి సంపన్నాలయిన కళ్ళు, మంటత భావతను ఎరగని ఆ కళ్ళు యిటికరాయి ముక్కల్లాగా వున్నై.

'అమ్మా:'

'ఆఁ'

'నన్నేమీ శపించకు' అని ఏడ్చాడు అప్పావుధాన్లుగారు. అన్న గారు ఫోంచేసి వొచ్చి చూశాడు. తప్పిద్దామని అనుకుని గూడా ఏమీ చెయ్యలేక, ఆ దృశ్యం చూడలేక తలవొంచుకుని బరువుగా వెళ్ళి పోయాడు.

'జెండాకూ జై—' రామ్మూర్తి అరుస్తూ వొచ్చాడు. తల్లి తాత మంచం దగ్గర వుంది.

'తాతయ్యకు యింకా తగ్గలా' అన్నాడు.

'వోరి భడవా' అన్నారు తాతగారు. అది వారి ఆశీర్వచనం.

అప్పావధాన్లుగారు సన్యసించారు. బ్రహ్మీభూతులూ అయారు. వారి చావు పెళ్ళితో సమానం. ముసిలమ్మ మాటకేంగాని, పచ్చని పండు ముత్తయిదువు పార్వతీ దేవికి చేటు వొచ్చిందిగానీ. ఆయనకేం మహా రాజు అన్నారు అందరూ.

ఆంజనేయులూ, కనకమ్మా వొచ్చారు, వెళ్ళారు. రామసీత మొగుడితోపాటు వెళ్ళలేదు. తల్లికోసం అని వుండిపోయింది. ఆంజనేయులుకు ఆస్తివొచ్చిన సంగతి తెలిసింది. అతనికేమీ సంతోషం రాలేదు. మనిషి చిక్కిపోయాడు. వెనకటి నేవళం లేదు. తోస్తే పడేట్టున్నాడు. ఇంటికి అల్లుడు వొచ్చినట్టు రాలేదు, ఏదో ఎవరో వచ్చినట్టు వొచ్చాడు. మేనమామ పోయాడని అతను ఏడ్చాడు, కానీ ఏడ్చాడని చెప్పినా ఎవరూ నమ్మేట్టులేదు. దశమారింది.

'వొస్తావా?' అనడిగాడు ఆంజనేయులు భార్యను.

'ఎల్లారాను చెప్పండి' అంది రామసీత.

రామసీత మొహాన నవ్వూ, నిండూ లేదు. ఎండి వాడిపోయి వుంది.

'కోడలుందిగా అమ్మా. అయినా ఆడకూతుళ్ళు ఎన్నాళ్ళుంటారేం? ఆస్తి యిచ్చిన తల్లయితే వుంటారేమో' అంది కనకమ్మ అక్కడా అక్కడా. నోరుంది గదా అని అన్నట్టున్నై ఆ మాటలు.ఎవరూ పట్టించుకోలేదు వాటిని.

తల్లీ, కొడుకూ వెళ్ళిపోయారు.

రామసీత పుట్టింట్లోనే వుండిపోయింది.

# 5

రెండు మూడు నెలలు గడిచై. ముసిలమ్మ మరి మంచం దిగలేదు. ఆవిడా రోజులు వెళ్ళదీస్తోంది.

చిన్నప్పుడు తల్లిచేసిన దానికి తిరిగి చేసి ఋణం తీర్చుకుంటోంది. రామసీత.

మనోహరమైన అపవాదులు గాలిలో తేలివొస్తున్నవి.

రామసీతకు అక్కడ ఎవడో వున్నాడుట. వాణ్ణివిడిచిరా లేదుట. దీనికి అందరూ హర్షించారుట. అందుకే అల్లా ఆస్తి రాసియిచ్చారుట. లేకపోతే కాపరానికి రాదా అనటం. రంకు కట్టడం తేలిక. మరొకరికి రంకు కట్టుతూంటే చెవులు దొర పెట్టుకుని వినే వాళ్ళుంటారు. ఇకిలిస్తారు, పోతారు. నమ్మితే నమ్మనూ నమ్ముతారు. ఆలోచించరు. ఆలోచిస్తే ఆ వెకిలి తృప్తి పోతుందేమోనని భయం.

కట్టబడిన మనిషి?

రామసీత చెవులనూ పడ్డవి యీ మాటలు. ఆమె ఏమనుకుందో ఏమో. పెదిమ విప్పలేదు.

తల్లికొక్కటే స్తనయంగా వుంది. "నేనిహ యింతేనమ్మా. కాపరం చెడగొట్టుకోకు" అందావిడ 'వెళ్తా లెస్తూ' అంది రామసీత. 'వెళ్ళక పోతే ఏమ'న్నాడు అన్నగారు. వొదినగారు ఎటూ అనలేకపోయింది. 'ఆవిణ్ణి అన్నవాళ్ళు పురుగులుపడి చస్తార'ని కసితీరా అంది. ఆమె ఆడబిడ్డను వెనకేసుకొచ్చి అన్నదంటే నిజమైవుంటుందనైనా అనుకోదు. కాబోలు ప్రపంచం.

తల్లే బలవంతాన కూతుర్ని ప్రయాణం చేయించింది. తల్లిని విడిచి కూతురు వెళ్ళలేకపోయింది. ఎదురుగాలిలో ముందుకెళుతున్న జెండాలాగా ఆమె అత్తింటికి వెళ్ళింది.

పాత్ర సామగ్రి కూడా సర్వమంగళం అయింది. ఓ పంచనుంటున్నారు. మరోపై పంట గూడా ముందే తెచ్చి అప్పులు కొన్ని తీర్చారు. వాకటో రెండో పతాలున్నై. రామసీతను చూసి అత్తగాని, మొగుడుగాని ఆదరించలేదు. సత్రంలోకి ఎవరో వొచ్చి వెళుతూంటే చూస్తున్నట్టు చూశారు.

'యిల్లా వున్నారే' మంది రామసీత మొగుణ్ణి. ఆంజనేయులు వులకలేదు, పలకలేదు. ఆ రాత్రి ఎల్లాగో అల్లా మూత్తుడుచుకున్నారు. ఉప్పుఃవుంటే పప్పులేదు. పులుసుంటే కారంలేదు. ఆరాత్రి భార్యాభర్తలు ఎడమొహం పెడమొహంగానే ఉన్నారు. భర్తగదా అని దగ్గిరికి పోబుద్ధి పుట్టలేదామెకు, చేసుకున్న భార్యగదా అని అతనూ పిలవలేదు. చాప పరుచుకుని, కొడుకుని దగ్గిరెట్టుకు పడుకుంది. పసివెధవ జెండాను పట్టుకునే పడుకున్నాడు, తెల్లారింది. దుద్దులూ, ముక్కు పుడకలూ తీసింది. అత్తగారి చేతికిచ్చింది.

"ఎందుకు?"

'కావలసినవి కొనుక్కుందాం' అంది రామసీత.

'నాకు తెలీదు. మీ ఆయనకు యివ్వు. అయినా యివేం చాలతై?'

'మంగళ సూత్రం వుందిహ' అంది.

'అదిగూడా తీయాలనుకోకు తల్లీ. వాడింకా నన్ను దాటెయ్యాలి. నీకు పుణ్యముంటుంది' అంది అత్తగారు ఏడుస్తున్న గొంతుకతో.

రామసీత నొచ్చుకుందో, ఏమయిందో తెలీదు. ఆమె ఏ ఉద్దేశంతో ఆ మాట అందో అది దుమ్ము అయింది.

భర్తకు ఆ రెండూ యిచ్చింది. 'అక్కర్లేదు' అన్నాడతను. ఆంజనేయులు గొంతిక పొడి ఆరిపోయింది. అల్లా మాటలు వొస్తున్నై. రాత్రి తాను సరకాయించి చూడలేదు. బూడిద గుమ్మడికాయ రంగు వొస్తోంది. మనిషి ఎండి పోతున్నాడు.

'మీ యిష్టం' అని వాటిని అక్కడే పెట్టింది. ఇవతలికి రాబో తోంది.

'వాడు వెళ్ళమంటేనే వచ్చావా?' అన్నాడు. దగ్గుతెర వచ్చింది. కళ్ళు వుమ్మేశాడు. ఆయాస పడుతున్నాడు.

'వాడెవడు' అంది రామసీత.

'అదే—నీ కొత్త మొగుడు.'

రామసీత భరించలేక పోయింది. వెనక్కు తిరిగింది. ఆంజ నేయులు మళ్ళీ దగ్గి కళ్ళె వుమ్మేశాడు.

ఇంట్లోకి వొచ్చింది. గాంధీగారి బొమ్మా, రాముడి బొమ్మా యింకా బజారు కెళ్ళలేదు. వోమూల మేకును అంటిపట్టుకున్నవి. ఆమె కొడుకు నెత్తుకుని సరాసరి అక్కడికి వొచ్చింది. పటాలకు దణ్ణం పెట్టింది. తల్లితోపాటు కొడుకూ దణ్ణం పెట్టాడు.

'పరాత్పరా! చాలు ఈ మాటలు." అంది. గొంతిక వణికింది.

'వైధవ్యం వొచ్చినా సంతోషిస్తాను. ఈ కాపరానికి ఒక్క దణ్ణం' అనుకుంది. లెంపలు వేసుకుంది. కొడుకూ తల్లిని చూసి లెంపలేసు కున్నాడు.

'ప్రభూ, ఒక్క దణ్ణం' అని నిట్టూర్చింది రామసీత.